

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి | సోమవారం | 23-03-2026 | సంపుటి: 01 | సంచిక : 277 | వేల: 2 రూ | పేజీలు :08 | సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy | Monday, 23-03-2026 | Volume :01 | Issue: 277 | Cost: 2 | Pages:08 | Editor : Katta HimaPavani

రిపోర్టర్లు కావలెను



జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి
నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది.
తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ,
మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా
పని చేయుటకు ఆసక్తి, అనుభవం
ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్
చేసి సంప్రదించగలరు.

Contact Number
9059328777



## మోదీ సరికొత్త రికార్డు..

- ప్రభుత్వాధినేతగా 8,931 రోజులు పూర్తి
- పవన్ కుమార్ చామ్లింగ్ రికార్డు
  కనుమరుగు: భారత రాజకీయాల్లో నవశకం
- గుజరాత్ సీఎంగా మొదలై.. దేశ ప్రధానిగా హ్యాట్రిక్ వరకు..
- 2001 నుండి నేటి వరకు ప్రజాక్షేత్రంలో తిరుగులేని నేత
- నెహ్రూ రికార్డు సమం..
  చామ్లింగ్ రికార్డు అధిగమనం: మోదీ 'పవర్' పాలిటిక్స్

న్యూఢిల్లీ

భారత ప్రధాని నరేంద్ర మోదీ సరికొత్త రికార్డు సృష్టించాడు. ప్రభుత్వాధినేతగా 8,391 రోజులు పూర్తి చేసుకుని రికార్డు సృష్టించాడు. అటు సీఎంగా, ఇటు ప్రధానిగా మోదీ ఈ ఘనత దక్కించుకున్నాడు. 24 ఏళ్లకు పైగా రాజ్యాంగ బద్ధమైన ప్రభుత్వాధినేతగా, అది కూడా మధ్యలో ఎలాంటి విరామం లేకుండా కొనసాగి మోదీ రికార్డు నెలకొల్పాడు. దీంతో ఇప్పటివరకు అత్యధిక (8,390) రోజులు పదవిలో కొనసాగిన సిక్కిం మాజీ సీఎం పవన్ కుమార్ ఛామ్లింగ్ రికార్డును మోదీ అధిగమించారు.ప్రధాని మోదీ తొలిసారిగా 2001లో గుజరాత్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. 2014లో ప్రధాని పదవి చేపట్టేవరకు ఆయన సీఎంగానే కొనసాగారు. ప్రధానిగా మోదీ ఇంకా కొనసాగుతూనే ఉన్నారు. ఇదే సమయంలో గుజరాత్ రాష్ట్రానికి ఎక్కువ కాలం సీఎంగా పని చేసిన ఘనత కూడా ఆయన సొంతం. అలాగే, ముఖ్యమంత్రుల నుంచి ప్రధాని పదవి చేపట్టి, ఎక్కువ కాలం కొనసాగింది కూడా మోదీయే. మోదీ ప్రధానిగా హ్యాట్రిక్ సాధించారు. 2014, 2019, 2024లో మోదీ తన పార్టీని, కూటమిని గెలిపించి

-మిగతా 2 లో

# మళ్ళీ మాదే అధికారం

## సిద్దిపేటలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే మంత్రి పదవి



- రూ.3500 కోట్ల రైతు భరోసా విడుదల
- ఎగుమతులు చేసే స్థాయికి రైతులు ఎదగాలి
- వ్యవసాయమూ తెలుసు.. చీడపీడలకు ఏ మందు వేయాలో తెలుసు
- అన్ని నియోజకవర్గాల్లో సమానంగా అభివృద్ధి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- నర్మెట్టలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం, రైతు ఉత్సవాల సభ
- వంట నూనె రిఫైనరీ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన

మెదక్ ప్రాంతీయ ప్రతినిధి మార్చి 22 నేటి దర్శిని,

"రైతులు ఒకే విధంగా పంటలు వేయకుండా పంటల మార్పిడి చేసుకోవాలి.. దానివల్ల పంటలు పుష్కలంగా పండి ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటారు. వాణిజ్య పంటల సాగువైపు మళ్లాలి. రైతు భరోసా నిధులు విడుదల చేస్తున్నాం.. రాష్ట్రంలోని 73 లక్షల మంది రైతులకు ఈ పెట్టుబడి సాయం అందనుంది. రైతు పక్షపాతిగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంది" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలో నర్మెట్ట గ్రామంలో రూ.300 కోట్లతో నిర్మించిన ఆయిల్‌పామ్ పరిశ్రమను ఆదివారం మంత్రులతో కలిసి ప్రారంభించారు.

-మిగతా 2 లో



## తొలివిడత రైతుభరోసా రూ.3446.94 కోట్లు

- నేడు రైతు ఖాతాల్లో జమ
- మొదట విడతలో ఎకరా వరకు అందరికీ వర్తింపు
- 68.90 లక్షల మంది రైతులకు లబ్ది
- ఏప్రిల్ రెండో వారంలో రెండో విడత రూ.2,650 కోట్లు


హైదరాబాద్ మార్చి 22 నేటి దర్శిని,

రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా పథకంలో భాగంగా తొలి విడతలో రాష్ట్ర ప్రభుత్వం రూ.3,446.94 కోట్లను విడుదల చేసింది. ఆదివారం సెలవు దినం కావడంతో సోమవారం రైతుల ఖాతాల్లో ఆ డబ్బులు జమ కానున్నాయి. అయితే, తొలి విడతలో భూమి ఉన్న ప్రతి రైతుకూ ఒక ఎకరా వరకు(మొత్తం 57,44,907.19 ఎకరాలు) మాత్రమే ఇది వర్తించనున్నది. దీంతో 68,89,955 మంది రైతులకు లబ్దిచేకూరనున్నది. ఏప్రిల్ రెండో వారంలో రూ.2,650 కోట్లు, మూడో విడతలో రూ.2,760 కోట్లను విడుదల చేయనున్నది. రెండో విడత పూర్తయ్యే సరికి 70 నుంచి 80 శాతం రైతులకు రైతు భరోసా పూర్తికానున్నది.

-మిగతా 2 లో

## ఎఫ్-15'పై ఇరాన్ దాడి

- హోర్ముజ్ సమీపంలో కూల్చివేసినట్టు ప్రకటన
- ట్రంప్ '48 గంటల అల్టిమేటం' అనంతర పరిణామం






## ఇరాన్‌కు ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్

- హర్మూజ్ జలసంధిని 48 గంటల్లో తెరవాలి..
- తెరవకపోతే,అతి పెద్దదైన
  విద్యుత్ ప్లాంట్లను పూర్తిగా ధ్వంసం చేస్తాం

న్యూఢిల్లీ

ఇరాన్‌పై మరోసారి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. 48 గంటల్లోగా ఇరాన్ ఎటువంటి బెదిరింపు లేకుండా హర్మూజ్ జలసంధిని తెరవకపోతే, ఆ దేశంలోనే అతి పెద్దదైన విద్యుత్ ప్లాంట్లను పూర్తిగా ధ్వంసం చేస్తామని ట్రూత్ సోషల్ మీడియా వేదికగా మరోసారి పోస్ట్ చేశారు. కాగా, అంతకుముందు ట్రంప్ చేసిన ప్రకటన రాజకీయ విశ్లేషకులను ఆలోచనలో పడేసింది. ట్రూత్ సోషల్ వేదికగా డోనాల్ట్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. పశ్చిమాసియాలో చేపట్టిన మిలిటరీ ఆపరేషన్ ద్వారా తమ లక్ష్యాలకు చేరువైనట్లు ఆయన వెల్లడించారు. ఇరాన్‌పై చేపట్టిన సైనిక చర్య గురించి ట్రంప్ తన సోషల్ మీడియా అకౌంట్ ద్వారా తెలిపారు. ఇరాన్‌కు చెందిన క్షిపణి సామర్థ్యం, లాంచర్లు, ఇతర ఆయుధాలను పూర్తిగా ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఇరాన్ ఇండస్ట్రియల్ బేస్‌ను కూడా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆ దేశ నేవీ, ఎయిర్ ఫోర్స్‌ను కూడా దెబ్బతీశామన్నారు. యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ ఆయుధాలను కూడా ధ్వంసం చేశామన్నారు. ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేసే సామర్థ్యాన్ని పూర్తిగా దెబ్బతీశామన్నారు. పశ్చిమాసియాలోని తమ మిత్ర దేశాలను రక్షించుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తామన్నారు. ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్, కువైట్ ఇతర దేశాల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. కీలకమైన హోర్ముజ్

-మిగతా 2 లో

## సీఎం రేవంత్ అధ్యక్షతన నేడు క్యాబినెట్

- ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో
  10శాతం తల్లిదండ్రులకు..
- 18 ఏండ్లలోపు పిల్లల డిజిటల్ మీడియాపై నియంత్రణ
- విద్వేష ప్రసంగాల నిరోధానికి చట్టం
- సాధ్యాసాధ్యాలపై చర్చించనున్న మంత్రివర్గం

హైదరాబాద్ మార్చి 22 నేటి దర్శిని,

'దేశంలోను, రాష్ట్రంలోనూ కన్నతల్లిదండ్రులను పట్టించుకోని ఉదంతాలను చూస్తున్నాం.. అలా కన్నవారిని గాలికొదిలేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల పట్ల మా ప్రభుత్వం సీరియస్‌గా వ్యవహరించనుంది. వారి జీతాల్లోంచి ఎంతో కొంత తల్లిదండ్రుల ఖాతాల్లోకి జమయ్యే విధంగా విధానపరమైన నిర్ణయం తీసుకుంటాం...' ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సందర్భాల్లో చెప్పిన మాటలివి. ఆయన చెప్పిన ఈ అంశాన్ని సోమవారం

-మిగతా 2 లో



# ఇందిరమ్మ ప్రభుత్వమంటే ఓ భరోసా

## మూడు ఎకానమిక్ జోన్లుగా రాష్ట్ర అభివృద్ధి

- ఇందిరమ్మ జీవిత బీమాతో
  1.15 కోట్ల కుటుంబాలకు భరోసా
- ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరిచేలా బడ్జెట్
- రాష్ట్ర జీడీపీని పెంపొందించేలా బడ్జెట్ ప్రవేశపెట్టాం
- ఉపముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి మల్లు భట్టివిక్రమార్క

ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి మార్చి 22 నేటి దర్శిని,

ఇందిరమ్మ ప్రభుత్వమంటే ఓ భరోసా అని.. బడ్జెట్ సంఖ్యల చుట్టూ తిరిగే సంఖ్యలు కాదు.. ప్రజల చుట్టూ తిరిగే అంకెలు మాత్రమేనని, ప్రజల జీవనస్థితిగతులు మెరుగు పడటానికి ఉపయోగపడేది బడ్జెట్ అని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. దేశంలోనే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా అనేది అతిపెద్ద భరోసా అన్నారు.

-మిగతా 2 లో





## కేంద్రమంత్రులతో మోడీ కీలక భేటీ

- పశ్చిమాసియా ఉద్రిక్తతల నడుమ సమావేశం
- పెట్రోలియం, విద్యుత్, ఎరువులపై చర్చ
- సరఫరాలో అవాంతరాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశం
- హాజరైన రాజ్‌నాథ్, అమిత్ షా, నడ్డా, పలువురు మంత్రులు

న్యూఢిల్లీ

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న తరుణంలో భారత్‌లో ఇంధన సంక్షోభం ఆందోళన కలిగిస్తున్నది. ఈ తరుణంలో ప్రధాని మోడీ.. పలువురు కేంద్ర మంత్రులతో కీలక సమావేశాన్ని నిర్వహించారు. దేశంలో పెట్రోలియం, విద్యుత్, ఎరువుల రంగాల స్థితిగతులపై వారితో చర్చించారు. ఈ సమావేశానికి కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, జేపీ నడ్డా, శివరాజ్‌సింగ్ చౌహాన్, నిర్మలా సీతారామన్, జైశంకర్, రామ్మోహన్ నాయుడు, హర్దీప్ సింగ్ పురి, సర్బానంద సోనోవాల్, జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ హాజరయ్యారు. దేశవ్యాప్తంగా నిరంతర సరఫరా, సమర్థ పంపిణీపై మంత్రులతో ప్రధాని మోడీ చర్చించారు. గ్యాస్, పెట్రోల్ , ఎరువుల సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలన్న ప్రధాని.. సరఫరాలో అవాంతరాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వినియోగదారులు, పరిశ్రమల ప్రయోజనాలను కాపాడటానికి కేంద్రం అంతర్జాతీయ పరిణామాలను నిరంతరం పరిశీలిస్తోందని

-మిగతా 2 లో

## కాంగ్రెస్‌లో కొనసాగే పరిస్థితి లేదు

- 25న పార్టీ సభ్యత్వానికి రాజీనామా :
- మాజీ మంత్రి జీవన్‌రెడ్డి



జగిత్యాల మార్చి 22 నేటి దర్శిని,

కాంగ్రెస్ పార్టీలో తాను ఇకపై కొనసాగే పరిస్థితి లేదని సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో కొనసాగే పరిస్థితులు లేవని, ఈ నెల 25న సభ్యత్వానికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. 20నెలలుగా జగిత్యాలలో జరుగుతున్న పరిణామాలు తనను ఈ నిర్ణయానికి తీసుకొచ్చాయని, మానసిక క్షోభను అనుభవించానని తెలిపారు.

-మిగతా 2 లో

## లష్కర్-ఎ-తోయిబా కమాండర్ హత్య

హైదరాబాద్

లష్కర్-ఎ-తోయిబా ప్రధాన కార్యాలయం 'మార్కజ్ తాయిబా'లో శనివారం సీనియర్ కమాండర్ బిలాల్ అరిఫ్ సలాఫీ అత్యంత దారుణ హత్యకు గురయ్యాడు. ఈద్ ప్రార్థనల అనంతరం బయటకు వస్తున్న సమయంలో గుర్తు తెలియని దుండగులు అతన్ని సమీపం నుండి తుపాకీతో

-మిగతా 2 లో



# మోదీ సరికొత్త రికార్డు..



మొదటి తరువాయి

అధికారం చేపట్టారు. ఇంతకుముందు మూడుసార్లు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన జవహర్ లాల్ నెహ్రూ రికార్డును సమం చేశారు. వరుసగా దేశంలో అత్యధిక రోజులు పదవిలో కొనసాగిన రెండో ప్రధానిగా కూడా మోదీ నిలిచారు. ఈ విషయంలో ఇందిరాగాంధీ రికార్డును మోదీ దాటారు. అలాగే ఒక పార్టీ పక్ష నేతగా వరుసగా ఆరుసార్లు ఎన్నికైన ఘనత కూడా ఆయనదే. మోదీ అత్యధిక రోజులు దేశంలో ప్రభుత్వాధినేతగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనకు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుభాకాంక్షలు తెలిపారు.ద

# ఇరాన్‌కు ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్

మొదటి తరువాయి

జలసంధికి రక్షణ ఏర్పాటు చేయాలని, ఆ జలసంధిని వినియోగించే దేశాలు దానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఒకవేళ ఎవరికైనా ఈ అంశంలో సహాయం అవసరమైతే తాము ఆ దేశాలను ఆదుకోనున్నట్లుచెప్పారు. తాము చేపట్టిన మిలిటరీ ఆపరేషన్ పట్ల శ్రద్ధ చూపిన వారికి థ్యాంక్స్ చెబుతున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై దాడి చేసిన అమెరికా తన మిలిటరీ ఆపరేషన్‌ను నిలిపివేయాలనుకుంటునున్నట్లు చెప్పిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఇలా తీవ్ర వాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# తొలివిడత రైతుభరోసా రూ.3446.94 కోట్లు

మొదటి తరువాయి

అత్యధికంగా నల్లగొండ జిల్లాలోని 5,22,313 మంది రైతులకు 268.57 కోట్ల రూపాయల లబ్ధి చేకూరనున్నది. అత్యల్పంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 24,935 మంది రైతులకు 10.43 కోట్లు విడుదల కానున్నాయి.

# ఎఫ్-15'పై ఇరాన్ దాడి

-హార్ముజ్ సమీపంలో కూల్చివేసినట్లు ప్రకటన
-ట్రంప్ '48 గంటల అల్టిమేటం' అనంతర పరిణామం

టెహ్రాన్

పశ్చిమాసియాలో పెరుగుతున్న యుద్ధ ఉద్రిక్తతల నడుమ అమెరికా, ఇరాన్‌లు సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకుంటున్నాయి. హార్ముజ్‌ను 48 గంటల్లో తెరవాలనీ, లేదంటే తీవ్ర పరిణామాలుంటాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం విదితమే. అయితే తమ నుంచి కూడా ప్రతిఘటన తప్పదని ఇరాన్ సైతం బదులిచ్చింది. దీంతో మధ్యప్రాచ్యంలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ఇరాన్ కీలక ప్రకటన చేసింది. శుత్ర దేశానికి చెందిన ఎఫ్-15ను లక్ష్యంగా చేసుకొని క్షిపణులతో దాడి చేసినట్టు పేర్కొంది. దక్షిణ తీర ప్రాంతం హార్ముజ్ ద్వీపం సమీపంలో ఇరాన్ మీదుగా ఎగురుతున్న 'శత్రువు' ఎఫ్-15 యుద్ధ విమానాన్ని అడ్డగించి, తమ క్షిపణులతో కూల్చివేసినట్టు వివరించింది. ఈ మేరకు ఇరాన్ వైమానిక రక్షణ ప్రధాన కార్యాలయం ఆదివారం తెలిపింది.

# కాంగ్రెస్‌లో కొనసాగే పరిస్థితి లేదు

మొదటి తరువాయి

నాలుగు దశాబ్దాల అనుబంధాన్ని తెంచుకోవడం బాధాకరమని, అయినప్పటికీ తన సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో పార్టీ వీడాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. శాసన మండలిలో ఒంటరి పోరాటం చేశానని, ప్రస్తుతం అధికారంలో ఉన్నప్పటికీ ప్రజల పక్షాన నిలబడి పోరాడినట్టు గుర్తు చేశారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం వల్ల పరిస్థితులు క్లిష్టంగా మారాయని తెలిపారు. పార్టీ కార్యకర్తల హక్కులను కాలరాస్తున్నారని, గౌరవం లేని చోట కొనసాగడం సాధ్యం కాదని తేల్చి చెప్పారు. ఈ నెల 25న బండారి గార్డెన్‌లో అభిమానులు, శ్రేయోభిలాషులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. తనకు జరిగిన అన్యాయంలో ఎమ్మెల్యే పాత్ర కూడా ఉందని ఆరోపించారు. ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మాణంలో జాప్యం వల్ల ఉత్తర తెలంగాణకు కరువు ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న ఈ ప్రాజెక్టును విస్మరించడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో తన స్వేచ్ఛకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటున్నానని, ఈ నెల 25న కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. జగిత్యాలతో తన అనుబంధం ఎప్పటికీ కొనసాగుతుందని తెలిపారు.

# లష్కర్-ఎ-తోయిబా కమాండర్ హత్య

మొదటి తరువాయి



కాల్చి, కత్తులతో నరికి చంపారు. 2005 నుండి సంస్థలో కీలక పాత్ర పోషిస్తూ, నిధుల సమీకరణ, రిక్రూట్‌మెంట్లలో ఆరితేరిన సలాఫీని ఆసుపత్రిలో చేర్పించినా, చికిత్స పొందుతూ మరణించినట్లు నివేదికలు తెలిపాయి.

# మళ్ళీ మాదే అధికారం

మొదటి తరువాయి

అక్కడే నిర్మించతలపెట్టిన వంటనూనె రిఫైనరీ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం రైతు ఉత్సవాల బహిరంగ సభలో రైతు భరోసా నిధులను సీఎం విడుదల చేశారు. ఇవాళ బ్యాంకులకు సెలవు దినం కావడంతో రైతుల ఖాతాల్లో రేపు డబ్బులు జమ కానున్నాయి. తొలి విడతగా ఎకరంలోపు ఉన్న రైతులకు రూ.3,600కోట్లు ఖాతాల్లో జమకానున్నాయని, ఆ తర్వాత రెండో విడతలో రూ.2,650 కోట్లు, చివరి విడత గా రూ.2,760 కోట్లు విడుదల చేయను న్నామని తెలిపారు. మొత్తం 45 రోజుల్లో రైతు భరోసా కింద 9వేల కోట్ల రూపాయలను 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో వేస్తామన్నారు.రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరతోపాటు రూ.500 బోనస్ ఇస్తున్నామని తెలిపారు. గతంలో కేసీఆర్ హయాంలో రైతుల కోసం ప్రతినెలా రూ.2533 కోట్లు ఖర్చు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం 28 నెలల్లో ప్రతి నెలా రూ.5500 కోట్లు రైతు సంక్షేమం కోసం ఖర్చు చేస్తోందని చెప్పారు. తుఫాన్‌కి కామారెడ్డి ప్రాంతాల్లోని పొలాల్లో ఇసుక మేటలు వేశాయని, పంట నష్టం జరిగితే ఎకరానికి రూ.10 వేల పరిహారం ఇచ్చామని అన్నారు. ఈ 28 నెలల్లో రైతుల కోసం లక్షా 40 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని చెప్పారు.

**రైతులు వాణిజ్య పంటల వైపు వెళ్లాలి..**

ఒకప్పుడు క్వింటాల్ పసుపు అమ్మితే తులం బంగారం వచ్చేది, కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయని సీఎం అన్నారు. 10 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు చేయాలని సూచించారు. రైతులు వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపాలని, రంగారెడ్డి జిల్లా చుట్టూ ఒకప్పుడు పాడి పరిశ్రమ, పండ్ల తోటలు ఉండేవని, ఇప్పుడు రియల్ ఎస్టేట్‌తో అవన్నీ కనుమరుగయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంట మార్పిడి కోసం రైతులు పూనుకోవాలని, మిల్లెట్స్, ఆకు



కూరలు లాంటి పంటలు పండించాలని సూచించారు.

**ప్రయివేటు మోజు వద్దు**

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పెద్ద రైతు.. వ్యవసాయం గురించి ఆయనకు తెలిసినంతగా ఎవరికీ తెలియకపోవచ్చని, ఆయన వ్యవసాయశాఖ మంత్రిగా ఉండటం మన అదృష్టమని ముఖ్యమంత్రి అన్నారు. పంట మార్పిడి కోసం కృషి చేయాలని బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి ప్రధానిని కలుస్తామన్నారు. మహిళల కోసం సోదరుడిగా నిలబడుతానని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో అత్యుత్తమ శిక్షణ పొందిన టీచర్లు లక్ష మందికిపైగా పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రక్షాళన చేసే బాధ్యత తీసుకున్నామని, వచ్చే విద్యాసంవత్సరం నుంచి తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ప్రారంభిస్తున్నామని చెప్పారు. నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రారంభించడమే కాకుండా విద్యార్థులకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ప్రయివేట్ మోజులో పడొద్దు.. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ఇంజినీరింగ్ పూర్తి చేస్తే ఉద్యోగం వస్తుందన్న గ్యారెంటీ లేదు కానీ ఏటీసీ (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల)లో చదువుకుంటే ఉద్యోగం కల్పించే బాధ్యత తనది అని చెప్పారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఏటీసీల్లో చదివే విద్యార్థులకు ప్రతినెలా రూ.2వేల చొప్పున స్కాలర్‌షిప్ ఇస్తామని తెలిపారు.

**సిద్దిపేటలో అవకాశం ఇవ్వాలి**

2029లోనూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి రాబోతుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో సిద్దిపేటలో కాంగ్రెస్ గెలవాలని, ఇక్కడ గెలిచిన ఎమ్మెల్యేను మంత్రిని చేస్తామని హామీ ఇచ్చారు. సిద్దిపేటను 1984 నుంచి ఒకే కుటుంబం పాలిస్తోందని ఒక్కసారి ఇతరులకు కూడా అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్‌లా తాము వ్యవహరించడం లేదని, నారాయణపేట కొడంగల్ ప్రాజెక్టు నిర్వాసితులను ఒప్పించాకే పనులు ప్రారంభించామని తెలిపారు. "మూసీలో మీ మొసలి కన్నీరు ప్రజలు అర్థం చేసుకోవడం లేదనుకుంటున్నారా? అభివృద్ధి జరగకుండా అడ్డం పడుకుంటామంటే ఊరుకుంటామా? ముఖ్యమంత్రినై సిద్దిపేటకు రాలేదా? 2029లో మళ్లీ గెలిచి సిద్దిపేటకు వస్తామ"ని సీఎం విశ్వాసం వ్యక్తం చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుతో రాజకీయంగా తనకు భిన్నాభిప్రాయాలు ఉన్నాయన్నారు. కానీ వారి నియోజకవర్గాల్లోనూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ తమ నిజాయితీ నిరూపించుకుంటున్నామని చెప్పారు. నర్మెట్ట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులు తాను ముఖ్యమంత్రి అయ్యాకే ప్రారంభమయ్యాయని చెప్పారు. నిధుల విషయంలో తానేమీ వివక్ష చూపడం లేదని స్పష్టం చేశారు.

# సీఎం రేవంత్ అధ్యక్షతన నేడు క్యాబినెట్

మొదటి తరువాయి

నిర్వహించబోయే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించనున్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో సాయంత్రం 5 గంటలకు క్యాబినెట్ భేటీ కానుంది. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లోంచి కనీసం 10 నుంచి 15 శాతం వరకు తల్లిదండ్రుల ఖాతాల్లో జమయ్యేలా విధానపరమైన నిర్ణయం తీసుకుంటే ఎలా ఉంటుందనే అంశంపై చర్చించనున్నారు. దీనికి మంత్రివర్గం ఆమోదముద్ర వేస్తే... ఆ వెంటనే అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టనున్నారని సమాచారం. దీంతోపాటు 18 ఏండ్లలోపు పిల్లలను డిజిటల్ మీడియా నుంచి రక్షించేందుకు వీలుగా 'డిజిటల్ మీడియా నిరోధక, నియంత్రణ చట్టాన్ని' తీసుకురావాలనే అంశంపై క్యాబినెట్ చర్చించనుంది. ఇందుకు సంబంధించి వివిధ రాష్ట్రాలు అనుసరిస్తున్న పద్ధతులు, సాంకేతికాంశాలను పరిశీలించి విధి విధానాలు ఖరారు చేయటంపై మంత్రివర్గంలో చర్చించనున్నారు. రాష్ట్రంలో 'మత విద్వేష ప్రసంగాల నియంత్రణ'కు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై కూడా క్యాబినెట్ సమాలోచనలు చేయనుంది. దీనిపై కర్నాటక ప్రభుత్వం ఇప్పటికే కొంత కసరత్తులు చేసింది. వాటిపై అధ్యయనం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటితోపాటు గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన గిగ్ వర్కర్ల బిల్లు, క్యూర్.. ప్యూర్..రేర్‌లకు సంబంధించిన బిల్లుల సవరణపై క్యాబినెట్‌లో చర్చించి, ఆమోదముద్ర వేయనున్నారు. వీటన్నింటిలో ఏయే అంశాలకు మంత్రివర్గం పచ్చజెండా ఊపితే.. ఆయా అంశాలపై అసెంబ్లీలో బిల్లులను ప్రవేశపెడతారని ఉన్నతాధికారులు తెలిపారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో సమయాన్నిబట్టి వాటికి ఆమోదముద్ర వేస్తారు. టైం సరిపోకపోతే వచ్చే వర్షాకాల సమావేశాల్లో వాటిని ఓకే చేస్తారని సమాచారం.

# ఇందిరమ్మ ప్రభుత్వమంటే ఓ భరోసా

మొదటి తరువాయి

రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు ఈ జీవిత బీమా వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి స్కీం దేశంలోనే ఎక్కడా లేదన్నారు. విద్యా, వైద్య, గృహనిర్మాణం, వ్యవసాయం, పౌష్టికాహారం, పరిశ్రమలు, స్కిల్ డెవలప్‌మెంట్, ఉద్యోగాల కల్పన.. ఇలా అన్నింటినీ దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర జీడీపీని పెంపొందించే దిశగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టామన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బడ్జెట్ ఆవశ్యకతను వివరిస్తూ భట్టి మాట్లాడారు.

**కొత్తగా మూడు స్కీంలు..**

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలందరికీ పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో అల్పాహారంతోపాటు వారంలో మూడ్రోజులు పాలు, మరో మూడ్రోజులు రాగి జావ ఇవ్వాలని నిర్ణయించామని భట్టి తెలిపారు. ఇంటర్మీడియెట్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజనం పెట్టాలని నిర్ణయించామన్నారు. మానవ వనరులను వృద్ధి



చేసుకోవాలనే లక్ష్యంతో ఈ మూడు పథకాలను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ ఏడాది కూడా నియోజకవర్గానికి వెయ్యి ఇండ్ల చొప్పున ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ప్రతి నియోజకవర్గానికీ ఓ మోడల్ స్కూల్ చొప్పున మంజూరు చేశామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు క్యాష్ లెస్ హెల్త్‌కార్డును ప్రవేశపెట్టిన ఘనత కూడా తమ ప్రభుత్వానిదే అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు రూ.1.2 కోట్ల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించామన్నారు. జీడీపీని పెంపొందించే అనేక రంగాలకూ బడ్జెట్‌లో రాయితీలు ఇచ్చామన్నారు. 68.89 లక్షల పట్టాదారులకు ఎకరానికి రూ.6వేల చొప్పున 3,460.94 కోట్లు రైతుభరోసా కింద రైతుల అకౌంట్లో జమ చేస్తామన్నారు. 45 రోజుల్లో మూడు విడతలుగా రైతుభరోసా రైతులందరి అకౌంట్లలో జమ అవుతాయని తెలిపారు. ప్రపంచీకరణ నేపథ్యంలో స్కిల్డ్ యూనివర్శిటీలు ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ప్రతి నియోజకవర్గానికీ ఓ అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ చొప్పున మంజూరు చేశామన్నారు.

# కేంద్రమంత్రులతో మోడీ కీలక భేటీ

మొదటి తరువాయి

ఇప్పటికే ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రపంచ ఇంధన రవాణాలో కీలకమైన హార్ముజ్ జలసంధిని ఇరాన్ తన ఆధీనంలో ఉంచుకుంది. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇరాన్ చాలా తక్కువ నౌకలను మాత్రమే దీని గుండా అనుమతిస్తోంది. ఈ దిగ్బంధం వల్ల భారత్ సహా అనేక దేశాలకు ఇంధన సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ ఇప్పటికే సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, బహ్రెయిన్, కువైట్, జోర్డాన్, ఫ్రాన్స్, మలేషియా, ఇజ్రాయెల్, ఇరాన్ నాయకులతో ఫోన్ ద్వారా చర్చలు జరిపారు. గ్యాస్ పంపిణీని క్రమబద్ధీకరించడానికి, సరఫరా ఒత్తిళ్లను తగ్గించడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా సిటీ గ్యాస్ ప్రాజెక్టుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశిస్తూనే, కీలక రంగాలకు వాణిజ్య ఎల్పీజీ కేటాయింపులను పెంచింది.



# పేదింటి ఆడపడుచులకు అండగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్: ఎమ్మెల్యే

- పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- పార్టీలకు అతీతంగా అర్హతే ఆధారంగా ముఖ్యమంత్రి సహాయనిధి నిధులు అందిస్తామన్న ఎమ్మెల్యే




**ఉమ్మడి వరంగల్, మార్చి 22 (నేటి దర్శిని బ్యూరో):**
పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతుందని, ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు పెన్నిదని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు అన్నారు. ఆదివారం వరంగల్ జిల్లా పర్వతగిరి మండలానికి సంబంధించిన 83 మంది లబ్ధిదారులకు రూ.83,09,628 విలువ గల కళ్యాణలక్ష్మీ, షాధీ ముబారక్ చెక్కులను పర్వతగిరి మండల కేంద్రం లోని ఎంపీడీవో కార్యాలయం నందు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇల్లుకు ముగ్గు పోసినాయకులు, కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీగా ఎంపీడీవో కార్యాలయం విచ్చేసి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పేద బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ఈ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అనారోగ్యానికి గురై ఆర్థిక స్తోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా కల్పిస్తూ ఆపన్న హస్తం అందిస్తుందని వెల్లడించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కళ్యాణలక్ష్మి పథకంలో భాగంగా నూతన వధూవరులకు ఆర్థిక సహాయం అందించాలనే ఉద్దేశంతో ఈ పథకం ప్రారంభించబడిందని అన్నారు. పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతుందని, రాష్ట్రంలో పేదలకు నూతన రేషన్ కార్డు అందజేసి రేషన్ కార్డుదారులందరికీ ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, ఆడబిడ్డల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటూ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. మహిళా సర్పంచులు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ ప్రజల్లో మంచి పేరు సంపాదించుకోవాలని, రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటామని, తనకు అత్యధిక మెజారిటీ ఇచ్చి గెలిపించిన పర్వతగిరి మండల ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని ఎమ్మెల్యే అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని, వర్ధన్నపేట నియోజకవర్గంలో విద్య, వైద్య రంగంపై ప్రత్యేక ఫోకస్ పెట్టి ముందుకు వెళ్తున్నామని, దయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను తెలియజేయాలని, అర్హులైన పేద ప్రజలందరికీ సీఎం రిలీఫ్ ఫండ్ అందజేస్తామని, గతంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని డబ్బులు వసూలు చేసిన చరిత్ర ఉందని, ప్రస్తుతం ఒక్క రూపాయి లేకుండా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే చెప్పారు. ఇందిరా మహిళ విషయంలో డబ్బులు తీసుకున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని పార్టీ నేతలను ఎమ్మెల్యే హెచ్చరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు విషయంలో ఎవరికీ ఒక రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని, పారదర్శకంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న మోడల్ హౌస్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో వెంకట స్వామి, ఎంవో శేషు, మండల పార్టీ అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్, సర్పంచులు చిదురు శంకర్, మంజుల, గాడిపెల్లి మహేందర్, నరేష్, కనకయ్య, శ్రీనివాస్, మూడు లక్ పతి, కిషన్ నాయక్, శ్రీనివాస్, గాడుల రమేష్, విజయలక్ష్మీ, డెక్క సునీత, విజయ, ఉపసర్పంచ్ రాజు, దూడల మల్లన్న చైర్మన్ కారింగుల రాము, తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్న భక్తులు



**ఉమ్మడి వరంగల్, మార్చి 22 (నేటి దర్శిని బ్యూరో):**
ఉమ్మడి వరంగల్ జిల్లా ములుగు మేడారం సమ్మక్క, సారలమ్మ వనదేవతలను దర్శించుకునేందుకు భక్తులు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర ఒడిస్సా వివిధ రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క సారలమ్మ దేవాలయంలోని గోవిందరాజు, పగిడిద్దరాజు లను గిరిజన సాంప్రదాయ పద్ధతిలో దర్శించుకుని పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం, ఆదివారం సెలవు దినాలు కావడంతో పిల్లలతో కలిసి తల్లిదండ్రులు వనదేవతలను దర్శించుకోవడానికి తరలివచ్చారు. అలాగే రామప్ప దేవాలయం, లక్నవరం సరస్సు సందర్శించారు.

# సూర్యుడు కిరణాలతో రామప్ప శిల్ప సౌందర్యాన్ని ప్రతిబింబ చేస్తున్నాయి ....!



**ఉమ్మడి వరంగల్, మార్చి 22 (నేటి దర్శిని బ్యూరో):**
సూర్యుడి కిరణాలు రామప్ప దేవాలయం శిల్ప సౌందర్యాన్ని మరింత ప్రతిబింబచేస్తూ భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ఈ అరుదైన దృశ్యం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఉమ్మడి వరంగల్ జిల్లా ములుగు వెంకటాపూర్ మండలం లో ప్రసిద్ధి చెందిన కాకతీయుల కాలంలో నిర్మించబడిన రామప్ప దేవాలయం శిఖరం పై ఉన్న కలశాన్ని ఉదయించే సూర్యుడు తాకుతూ కనువిందు చేసిన అపూర్వ దృశ్యాన్ని సెల్ ఫోన్లలో బంధించారు.

# సమాజంలో పెరుగుతున్న కులవివక్షపై ఆందోళన

- ఉత్సవాల ద్వారా చైతన్యం సమానత్వమే లక్ష్యం
- పూలే-అంబేడ్కర్ జయంతుల వేడుకలకు ఆహ్వానం



**మిర్యాలగూడ, మార్చి 22 (నేటి దర్శిని):**
మహాత్మ జ్యోతిబా పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతుల సందర్భంగా నిర్వహించనున్న కుల రహిత సమానత్వ సాంస్కృతిక ఉత్సవాలను విజయవంతం చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున పిలుపునిచ్చారు. ఈనెల 28న నల్లగొండలో ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. మిర్యాలగూడ పట్టణంలోని కందుకూరి కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మహనీయుల ఆశయాలను కొనసాగించడానికి భావితరాలకు సామాజిక వివక్ష, అన్యాయాలు, దళితుల సంక్షేమం, అభివృద్ధి అంశాలపై సమగ్ర చర్చలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. నేటికీ కుల వివక్ష తీవ్రమైన రూపం దాలుస్తోందని, కులం--మతం పేరుతో సమాజంలో విభజనలు సృష్టించే కుట్రలు కొనసాగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దళితులపై దాడులు, కులదురహంకార హత్యలు, కులాంతర వివాహాలపై దాడులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. దళితులకు సమాన అవకాశాలు అందకుండా అడ్డంకులు సృష్టించే పరిస్థితులు బహిరంగంగా కనిపిస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో పూలే--అంబేడ్కర్ జనజాతర ద్వారా కులరహిత సమానత్వం కోసం సామాజిక సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, సామాజిక సంస్థలు, ప్రజా సంఘాలు, ప్రజాతంత్ర వాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, రాష్ట్ర కమిటీ సభ్యులు రెమిడాల పరుషరాములు, జిల్లా సహాయ కార్యదర్శి దైద శ్రీను, ఉపాధ్యక్షులు కోడిరెక్క మల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు దోరేపల్లి మల్లయ్య, యేసు, నల్ల రామస్వామి, బొంగరల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ నగరంలో 85 లక్షల వ్యయంతో రోడ్లు డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే నాయిని శంకుస్థాపన



**ఉమ్మడి వరంగల్, మార్చి 22 (నేటి దర్శిని బ్యూరో):**
అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం వరంగల్ నగరం లోని 30, 59 డివిజన్లలో రూపాయలు 85 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో 80 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు ప్రజలు పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లా టీపీసీసీ సాంస్కృతిక సేన మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఎర్ర రాధిక నియామకం

- నర్మెట్ట సభలో నియామక పత్రం అందుకున్న రాధిక

**సిద్దిపేట,మార్చి22 (నేటి దర్శిని):**
నాగారం మండలం పనిగిరి గ్రామానికి చెందిన ఎర్ర రాధికకు టీపీసీసీ సాంస్కృతిక సేన సూర్యాపేట జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియామక పత్రం అందజేశారు. ముఖ్యమంత్రి పాల్గొన్న బహిరంగ సభలో ఈ నియామక కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా టీపీసీసీ సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షులు చక్రాల రఘు, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు ఎర్ర అనుదీప్ రాధికకు నియామక పత్రాన్ని అందజేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎర్ర రాధిక మాట్లాడుతూ, సూర్యాపేట జిల్లాలో ప్రతి గడపగడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. పార్టీ అభివృద్ధికి, ప్రజా సేవకు అంకితభావంతో పని చేస్తానని హామీ ఇచ్చారు. తన నియామకానికి సహకరించిన ఏఐసీసీ కమిటీ సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపాటి నరసయ్య, సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణా రెడ్డి, రాష్ట్ర నాయకులు పోతు



భాస్కర్, నాగారం మండల అధ్యక్షులు తొడుసు లింగయ్య యాదవ్, పనిగిరి గ్రామ సర్పంచ్ తదితరులకు రాధిక కృతజ్ఞతలు తెలిపారు

# దేవాలయ నిర్మాణానికి జక్కిడి ట్రస్ట్ 50వేల రూపాయల విరాళం

- ఆధ్యాత్మిక సేవలో ముందున్న జక్కిడి చారిటబుల్ ట్రస్ట్
- హయత్‌నగర్‌లో ఆలయ నిర్మాణానికి విరాళాల వెల్లువ



**హయత్‌నగర్, మార్చి 22 (నేటి దర్శిని):**
లెక్చరర్స్ కాలనీ డివిజన్ పరిధిలోని హయత్‌నగర్ ప్రాంతం శ్రీరామ్ నగర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవాలయ నిర్మాణానికి జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ తరపున రూ.50,000 (అక్షరాల యాభై వేల రూపాయలు) విరాళంగా అందజేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఈ విరాళాన్ని అందించడం ఆనందంగా ఉందని ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. ఆధ్యాత్మిక సేవను పరమోన్నత ధర్మంగా భావిస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భగవంతుని ఆశీస్సులు అందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, నాగార్జున రెడ్డి, మహేష్ రెడ్డి, రాజు, కేశవ్, ఉమా మహేశ్వర్ రావు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## గాడిదగుడ్డు ప్రవచనం




మన దేశంలో తరతరాలుగా సమాజంలో ఉన్నతులమనుకొనేవారు ప్రబోధిస్తున్న, ప్రవచిస్తున్న గొప్ప మాటలు విని తరించి, భరించి తన్మయత్వంలో వాస్తవిక జగత్తునే మర్చిపోయాం. పోతున్నాం కూడా. జగత్తు మిధ్య పలాయనం మిధ్య సిద్ధాంతాల పరంపరలో ఇంతకుమించి ఏముంటుంది! ఇప్పటికయినా ఒంటికి, తలకింటికి అర్థం కావాల్సింది ఏమిటంటే, ధర్మ ప్రబోధాల పేరుతో పండిత ఉద్దండులు ఒలకబోస్తున్న అజ్ఞానం అవాంచనీయం ఎంతన్నదే తెలుసుకోవాల్సి ఉంది. ఇంతకంటే కుసంస్కార ప్రవచనం వేరే ఉంటుందా! ”బడిలో పిల్లోడు చదివితే చదువతాడు లేకుంటే పోతాడు! వాడికి మధ్యాహ్న భోజనమేమిటి? ఆ భోజనంలో గుడ్డేమిటి! గాడిద గుడ్డు అసహ్యకరంగా! ఆ గుడ్డుకు లెక్కలు.. డొక్కలు, దుస్తులిచ్చి, పుస్తకాలిచ్చి, అన్నంపెట్టి గాడిదగుడ్డు పెట్టి కూచోపెడితే, వాడిక చదువుతాడా? పెళ్లి కొడుకులా కూర్చోపెడతారా? అసలు బళ్లో తిండి పెట్టడమేమిటి?” ఇది మన వేదాధ్యయన ప్రవచనకారుని తలనిండా నింపుకున్న జ్ఞానం. ఇలాంటివి చెప్పే తరతరాలుగా సమాజంలోని అధిక భాగాన్ని చదువుకు దూరం చేశారు. కడుపునిండా తిండికి దూరం చేశారు. కడుపు నిండా తినగలిగి ఉన్నవారే చదువుకోవడానికి అర్హులని నిర్ణయించేశారు! అంతేకాదు, చదువుకున్నవాడు, తినికూచుని ఇలా మాటలు, బోధలు మాత్రమే చేయాలనీ నియమం చేశారు. ఇది అగ్రవర్ణుల అహంకారపూరిత హూంకారం. ఈ దేశంలో స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా సమాన హక్కులు, సమానత్వం అందరికీ చెందినవిగా ఉండాలనుకున్న రాజ్యాంగం అమలులోకి వచ్చినా, ఇంకా పేదరికం, ఆకలి, అవిద్య, అనారోగ్యం వెంటాడుతూనే ఉంది. రెండు పూటలా తినేందుకు బుక్కెడు అన్నం దొరకని అభాగ్యులు ఇప్పటికీ కోకొల్లలు. ఇక పిల్లల్లో పోషకాహారలోపం, రక్తహీనత, వయసుకు తగిన బరువులేకపోవడం, విటమిన్ లోపాలతో, భావిభారతం కొనసాగుతూనే ఉన్నది. పేదరికంలో ఉన్న ప్రజలు వారి పిల్లలను బడులకు పంపే పరిస్థితిలేదు. దానికి బదులు పనులకు పెట్టడాన్ని పరిశీలిస్తే తెలుస్తుంది. ఇలాంటి పరిస్థితులను గమనించి మన అత్యున్నత న్యాయస్థానం. ప్రతివారికి ఆహారం హక్కుగా ఉండాలని, పిల్లలకు మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వాలు అమలుపరచాలని ఆదేశించింది. ఇప్పుడు మన ప్రవచనకారుడు, న్యాయస్థాన తీర్పును అపహాస్యం చేయడం మహానేరం కాదా! పేదవాళ్ల ఆకలిని, పేదరికాన్ని హేళన చేస్తూ వారి హక్కులపై దాడి చేయటం ఈ గరకపాటి వారితోనే మొదలయింది కాదు, పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై అనేకమంది చదువుతున్న పండితులు, వారు సోమరిపోతులుగా తయారవుతారని ప్రేలాపించడం చూశాం మనం. బడాబాబులు చేసిన అప్పులను ప్రభుత్వం మాఫీ చేయడాన్ని, కంపెనీలకు సబ్సిడీలు ఇవ్వడాన్ని మాత్రం వీరు ప్రశ్నించరు. అసలు పిల్లలకు భోజనం పెట్టడమేమిటి? అని ప్రశ్నించడం, గుడ్డుపెట్టేవాడికి బుద్ధుందా! అని తిట్టడం వెనకాల ఎంత ద్వేషం కడుపులో ఉందో! దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన తరగతుల పిల్లలకు అసలు చదువును నిరాకరించాలనే ఆలోచనలే దీనికి కారణం. అన్నీ సంపుష్టిగా ఉన్నవారే చదువుకు అర్హులనే భావనే అందులో కనిపిస్తున్నది. దారిద్ర్యం అనుభవించేవారికి కూడా చదువుకునే అవకాశాన్ని కల్పించేందుకు పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నారు. అంబేద్కర్ ఆధ్వర్యంలో ఏర్పరచుకున్న భారత రాజ్యాంగం కల్పిస్తున్న హక్కు ఇది. ఆహారం, విద్య పొందటం అనేవి దయాదాక్షిణ్యాలమీద ఇచ్చే భిక్షకాదు, అది హక్కు. తరతరాలుగా శ్రామికులు సృష్టిస్తున్న సంపదను తమ వెనకాల వేసుకుని, సకల భోగాలు అనుభవిస్తూ బొజ్జలు పెంచిన జ్ఞాన ప్రవచనాలు ఇలానే ఉంటాయి. ఈ జ్ఞాన బోధకులు అసలైన నేరస్తులు, దుర్మార్గులు, అవినీతిపరుల మీద పల్లెత్తుమాట మాట్లాడరు. అన్యాయంగా దేశాలపై దాడులు చేస్తున్న సామ్రాజ్యవాద దేశాల గూర్చి కానీ, మానవ హననాన్ని గూర్చికానీ, పసిపిల్లలను నిర్దాక్షణ్యంగా చంపేస్తున్న యుద్ధ పిపాసులనూ ఏమీ అనరు. మహిళల వేషధారణల గూర్చి, కుల వివక్షతతో కూడిన వ్యాఖ్యలు చేయడం తప్ప, అసలు పేదరికానికి, ఆకలికి కారణాల జోలికే వెళ్లరు. వెటకారాలు, మూతివిరుపులు, ముచ్చుపలుకులు. ఇవీ ఉన్నత విద్యా పారంగతుల మనుకునే వారి ప్రవచనాంశాలు. వాళ్లకంటే కూడా, అట్లాంటి బోధకులను అనుసరిస్తున్న, వింటున్న అశేష ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన సమయమిది. విద్యార్థుల పట్ల అనుచితంగా మాట్లాడిన వారు క్షమాపణలు చెప్పాలి

# ఆయన మరణం చాలా సంతోషం.

- ఎఫ్‌బీఐ మాజీ చీఫ్ మృతిపై డొనాల్డ్ ట్రంప్ కామెంట్



**న్యూఢిల్లీ మార్చి 22 నేటి దర్శిని,**
అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ మాజీ చీఫ్ రాబర్ట్ ముల్లర్ III మరణించడంపై అమెరికా అధ్యక్షుడ డొనాల్డ్ ట్రంప్ ఆనందం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో ఒక పోస్ట్ చేశారు. ‘రాబర్ట్ ముల్లర్ III చనిపోయారు. ఆయన మృతి చెందినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. ఇక నుంచి ఆయన అమాయకులను ఇబ్బంది పెట్టలేరు’ అని ఆ పోస్టులో పేర్కొన్నారు.కాగా 81 ఏళ్ల రాబర్ట్ ముల్లర్ పార్కిన్సన్ వ్యాధితో శుక్రవారం చనిపోయినట్లు ఆయన కుటుంబం ప్రకటించింది. ఆ ప్రకటన అనంతరం ట్రంప్ ఈ పోస్ట్ చేశారు. అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ బుష్ హయాంలో ఎఫ్‌బీఐలో చేరిన రాబర్ట్ 12 ఏళ్లపాటు ఆ విధుల్లో కొనసాగారు. రాబర్ట్ నాయకత్వంలో ఎఫ్‌బీఐ దేశీయ నేరాలను పరిష్కరించడంతోపాటు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అనేక కీలక నిర్ణయాలు తీసుకుంది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ 2016లో తొలిసారి ఎన్నికైనప్పుడు ట్రంప్ విజయానికి రష్యా సాయమందించిందని ఆరోపణలు వచ్చాయి. ట్రంప్ విజయానికి రష్యా సహకారం అంశంపై అమెరికా న్యాయశాఖ జరిపిన విచారణలో రాబర్ట్ ప్రత్యేక న్యాయ సలహాదారుగా పనిచేశారు. దాంతో ఆయనను ట్రంప్ పాలకవర్గం చాలాసార్లు బహిరంగంగా విమర్శించింది.

# వాణిజ్య సిలిండర్ల సరఫరాను 20 శాతం పెంచిన కేంద్రం

**న్యూఢిల్లీ మార్చి 22 నేటి దర్శిని,**
: దేశంలో వాణిజ్య సిలిండర్ల సరఫరాపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సిలిండర్ల సరఫరాను 20 శాతం పెంచినట్లు తెలిపింది. అయితే ఈ అదనపు కేటాయింపునకు కొన్ని షరతులు విధించారు. వాణిజ్య సంస్థలు.. చమురు కంపెనీలతో నమోదు చేసుకోవాలి. అలాగే పైప్డ్ నేచురల్ గ్యాస్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటేనే ఈ అదనపు కేటాయింపు సాధ్యమవుతుందని తెలిపింది. ఈ మేరకు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు లేఖ రాసింది. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో వంట గ్యాస్ సరఫరాకు సంబంధించి గహ అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని గతంలో పేర్కొన్న కేంద్రం, ఇప్పుడు హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, క్యాంటీన్లకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా చాలా హోటళ్లు, రెస్టారెంట్లు, ధాబాలు, క్యాంటీన్లు మూతపడటంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, వలస కార్మికులకు ఉచితంగా 5 కిలోల గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయనున్నట్లు కేంద్రం వెల్లడించింది. ఎల్లుండి నుంచి వాటిని సరఫరా చేస్తామని ప్రకటించింది.



**గృహ వినియోగ సిలిండర్లు కొరత లేదు..**
కాగా, దేశంలో గహ వినియోగ సిలిండర్ల సరఫరా స్థిరంగా ఉందని, పంపిణీ కేంద్రాల వద్దనుంచి ఎలాంటి కొరత లేదని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. సాధారణ డెలివరీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. అదేవిధంగా, ప్రజలు ఆందోళనలతో చేసే బుకింగ్స్ చాలా వరకు తగ్గుముఖం పట్టాయని పేర్కొన్నారు. వినియోగదారులు సిలిండర్ల కోసం పంపిణీ కేంద్రాల వద్ద అనవసరంగా గుమికూడవద్దని, హోం డెలివరీపై ఆధారపడాలని సూచించారు.

# సర్వతోముఖాభివృద్ధితో చైనా ముందంజ

- ప్రతిబంధకాలకు ఎదురొడ్డి నిలబడిన చైనా
- విధానకర్తలు, కార్పొరేట్ కంపెనీల అధినేతల ప్రశంసలు
- ఘనంగా చైనా అభివృద్ధి ఫోరం సమ్మిట్





**బీజింగ్ ,న్యూఢిల్లీ మార్చి 22 నేటి దర్శిని,**
అన్ని రంగాల్లో అత్యాధునిక సాంకేతికతలను మేళవించి ప్రజల సమిష్టి కృషితో వేగవంతమైన సర్వతోముఖాభివృద్ధితో చైనా ప్రగతి పథాన దూసుకెళ్తోందని పలురు విధానరూపకర్తలు, ఆర్థిక నిపుణులు, కార్పొరేట్ సంస్థల అధినేతలు ప్రశంసలు కురిపించారు. అత్యాధునిక నాణ్యతతో కూడిన అభివృద్ధి లక్ష్యంగా విధానాల రూపకల్పన కోసం చైనా డెవలప్‌మెంట్ ఫోరం (సీడీఎఫ్) సమ్మిట్ బీజింగ్‌లో ఆదివారం నాడు ఘనంగా ప్రారంభమైంది. ఈ ఏడాది సమ్మిట్ ”చైనా తన 15వ పంచవర్ష ప్రణాళిక కాలం : అత్యంత నాణ్యమైన అభివృద్ధి సమిష్టి నూతన అవకాశాల సృష్టి” నేపథ్యంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా గవర్నర్ పాన్ గాంగ్‌షెంగ్, అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) తొలి డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాన్ కట్జ్, ఆపిల్ సంస్థ సీఈఓ టిమ్ కుక్, డెవలప్‌మెంట్ రీసెర్చ్ సెంటర్ స్టేట్ కౌన్సిల్ డైరెక్టర్‌లు హావో తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాన్ గాంగ్ షెంగ్ మాట్లాడుతూ... స్థిరమైన, హేతుబద్ధమైన, ఊహించగలిగే సహకార ప్రాధాన్యత ఇదివరకు కంటే ఇప్పుడు చాలా విలువైనదని తెలిపారు. వాణిజ్య ప్రతిబంధకాలు, ఆంక్షలు స్వేచ్ఛా వాణిజ్య పునుదాలను కృంగదీస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రక్షణవాదాన్ని నిర్దిష్టంగా వ్యతిరేకించితీరాలని, మరింత సమగ్రత, ప్రయోజనాల విస్తృతితో కూడిన ప్రపంచీకరణ అవసరమని ఆయన తెలిపారు.

**ప్రతిబంధకాలకు ఎదురొడ్డి నిలబడిన చైనా**
ప్రపంచవ్యాప్తంగా ఎటువంటి దిగ్భ్రాంతికర పరిస్థితులు, ఆంక్షలు, ఆటంకాలు, ప్రతిబంధకాలు ఏ రూపంలో ఎదురైనా వాటిని ఎదుర్కొని నిలబడగలమని చైనా నిరూపించిందని ఐఎంఎఫ్ తొలి డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాన్ కట్జ్ అన్నారు. ఈ సుస్థిరతను సాధించడంలో మార్కెట్ శక్తులకు ఇదివరకటికంటే గొప్ప ప్రాధాన్యత పాత్రను కల్పించారని తెలిపారు.

# ఒమన్‌లో ఆకస్మిక వరదలు..

- కారు కొట్టుకుపోవడంతో ఇద్దరు భారతీయులు మృతి, ఒకరు గల్లంతు



**మస్కట్: న్యూఢిల్లీ మార్చి 22 నేటి దర్శిని,**
ఒమన్‌లో ఆకస్మిక వరదలు సంభవించాయి. ఈ నేపథ్యంలో వరద ప్రవాహంలో ఒక కారు కొట్టుకుపోయింది. అందులో ప్రయాణించిన నలుగురు మరణించారు. మృతుల్లో ఇద్దరు భారతీయులు ఉన్నారు. మరో భారతీయ మహిళ గల్లంతైంది. శనివారం ఈద్ సందర్భంగా ఒమన్ రాజధాని మస్కట్‌తో సహా పలు నగరాల్లో ఆకస్మిక వరదలు సంభవించాయి. వరద నీరు పలు ప్రాంతాలను ముంచెత్తింది.కాగా, ఒమన్‌లోని అల్ బతినా గవర్నరేట్‌లో వరద ప్రవాహంలో ఒక కారు కొట్టుకుపోయింది. అందులో ప్రయాణించిన వారిలో నలుగురు మరణించారు. మృతుల్లో ఇద్దరు భారతీయులు ఉన్నారు. కేరళలోని త్రిథాలకు చెందిన యూసుఫ్, షమ్లాగా వారిని గుర్తించారు. అదే ప్రాంతానికి చెందిన మరో మహిళ రమ్లా గల్లంతైంది. ఆమె కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మరోవైపు కేరళకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత వీడీ సతీశన్ ఈ సంఘటనపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ జోక్యం కోరుతూ లేఖ రాశారు. ఒమన్‌లో సంభవించిన ఆకస్మిక వరదల్లో కేరళలోని త్రిథాలకు చెందిన యూసుఫ్, షమ్లా మరణించినట్లు పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు మద్దతు ఇవ్వాలని కోరారు. గల్లంతైన రమ్లా కోసం గాలింపు, సహాయక చర్యల్లో ఒమన్ అధికారులతో సమన్వయానికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని సతీశన్ విజ్ఞప్తి చేశారు.

## రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు..

● ఆమనగల్ మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు.....



**ఆమనగల్, మార్చి22(నేటి దర్శిని ప్రతినిధి);**
తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులు ఆదివారం విడుదల చేసినందుకు ఆమనగల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్,మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. గుర్రం కేశవులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిలో ఎన్ని ఇబ్బందులు ఉన్న రైతుల పక్షాన,రైతుల సంక్షేమం కొరకు రాష్ట్రంలో రైతులకు పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా నిధులు నేరుగా రైతు ఖాతాలోకి జమవుతున్నాయని గుర్రం కేశవులు అన్నారు. కాంగ్రెస్ బడుగు బలహీన వర్గాల పార్టీ అని మరోసారి సీఎం రేవంత్ రెడ్డి నిరూపించారని ఆయన అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు.

## రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి.....



**ఆమనగల్, మార్చి22(నేటి దర్శిని ప్రతినిధి);**
ఎన్ని ఇబ్బందులు ఉన్నా రైతు సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా నిధులను ఆయన ఆదివారం విడుదల చేశారు. ఆదివారం ఆమనగల్ మండలంలోకడ్తాల్ ,మాడుగుల, తలకొండపల్లి మండల ఆయా రైతువేదికల్లో దృశ్య శ్రావణ మాధ్యమంలో ప్రత్యక్ష ప్రసారం రైతు నేస్తం కార్యక్రమం ద్వారా ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులను విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీశైలం, రవీందర్, కాంగ్రెస్ నాయకులు మానయ్య, మండల పార్టీ అధ్యక్షుడు తెలగమల్ల జగన్, ఆయా మండలాల రైతులు, ఆయా మండలాల వ్యవసాయ శాఖ అధికారులు శ్రీనివాస్ గౌడ్, అరుణకుమారి,కవిత,శ్రీలత,వ్యవసాయ విస్తీర్ణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**ఉమ్మడి వరంగల్, మార్చి 22(నేటి దర్శిని బ్యూరో):**
ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వం చేపట్టిన అన్ని పథకాలు సకాలంలో అర్హులందరికీ అందజేస్తామని పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం క్యాంప్ కార్యాలయంలో కొడకండ్ల, దేవరుప్పుల, పాలకుర్తి, పెద్ద వంగర ,తొర్రూర్, రాయపర్తి మండలాలలోని పేద ప్రజలకు సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి పథకాలకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్‌లో విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి ఆహ్వానం



**నాగోల్, మార్చి22 (నేటి దర్శిని):**
మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఎల్బీనగర్ జోన్ పరిధిలోని నాగోల్ సర్కిల్‌లో ఉన్న కుత్బుల్లాపూర్ గ్రామంలో ఈ నెల 25వ తేదీ (బుధవారం) నిర్వహించనున్న శ్రీశ్రీశ్రీ ఉమామహేశ్వర స్వామి మరియు శ్రీశ్రీశ్రీ మాద్విరాట్ పోతులూరి విరబ్రహ్మేంద్ర స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి ఆహ్వాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జీఎస్ సేవా సమితి చైర్మన్, మాజీ కౌన్సిలర్ గ్యారాల శ్రీనివాస్ గౌడ్ గారికి ప్రత్యేక ఆహ్వాన పత్రికను గ్రామ ప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ గ్రామ మాజీ ఎంపీటీసీ భీమగౌని భాస్కర్ గౌడ్, సూరుగురి ప్రసాద్ రెడ్డి, సుర్వి ప్రవీణ్ గౌడ్, మబ్బు కృష్ణ, సందిల రోహిత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సేవే లక్ష్యంగా కృష్ణ గోపాల్ సేవా సమితి అల్పాహార కార్యక్రమం





**ఎల్.బి.నగర్, మార్చి22 (నేటి దర్శిని):**
కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో అనాథ పిల్లలు మరియు వృద్ధాశ్రమాల్లో అల్పాహార కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆశ్రమాల్లో నివసిస్తున్న అనాథలు, వృద్ధులకు అల్పాహారం పంపిణీ చేసి, వారి అవసరాలను తెలుసుకుంటూ సేవా భావాన్ని చాటిచెప్పారు.




ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ, తమ సంస్థ దాదాపు 11 సంవత్సరాలుగా నిత్య అన్నసేవ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తోందని తెలిపారు. దైవ ఆశీస్సులతో సంస్థ అధికారులు, సభ్యుల సహకారంతో ఈ సేవా కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే సేవా దృక్పథంతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సమితి కోశాధికారి కుష్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శి మనోజ్ గుప్తా, సభ్యులు సునీల్ దరాడే, పాకా సతీష్ యాదవ్, సురేష్ ధవాలే తదితరులు పాల్గొన్నారు. సేవా కార్యక్రమం పట్ల స్థానికులు ప్రశంసలు వ్యక్తం చేశారు.

## రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు..

● చిల్వేర్ గ్రామ సర్పంచ్, బోల్గం నాగరాజ్ గౌడ్
● మున్ననూర్ గ్రామ సర్పంచ్ చిట్టంపల్లి సుజాత మల్లికార్జున్ రెడ్డి

**మిడ్జిల్ , మార్చి22(నేటి దర్శిని ప్రతినిధి);**
తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులు ఆదివారం విడుదల చేసినందుకు మిడ్జిల్ మండలంలోని చిల్వే గ్రామ సర్పంచ్, బోల్గం నాగరాజ్ గౌడ్, మున్ననూర్ గ్రామ సర్పంచ్ చిట్టంపల్లి సుజాత మల్లికార్జున్ రెడ్డి సర్పంచ్లు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నాగరాజ్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిలో ఎన్ని ఇబ్బందులు ఉన్న రైతుల పక్షాన,రైతుల సంక్షేమం కొరకు రాష్ట్రంలో రైతులకు పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా నిధులు నేరుగా రైతు ఖాతాలోకి జమవుతున్నాయని గుర్రం కేశవులు అన్నారు. కాంగ్రెస్ బడుగు బలహీన వర్గాల పార్టీ అని మరోసారి సీఎం రేవంత్ రెడ్డి నిరూపించారని ఆయన అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు.



చిల్వేర్ గ్రామ సర్పంచ్ బోల్గం. నాగరాజ్ గౌడ్



మున్ననూర్ గ్రామ సర్పంచ్ చిట్టంపల్లి సుజాత మల్లికార్జున్ రెడ్డి

# సింగిల్స్-డబుల్స్‌లో మెయిన్ డ్రాలోకి వేణు ముప్పాల

● క్వాలిఫికేషన్ రౌండ్లలో అద్భుత ప్రదర్శన
● తమిళనాడు ఆటగాడిపై ఉత్కంఠభరిత విజయం
● డబుల్స్‌లో టాప్ సీడ్ జోడీపై తిరుగులేని పోరాటం
● మిక్స్‌డ్ డబుల్స్‌లో తృటిలో అవకాశాన్ని కోల్పోయిన వేణు



**హైదరాబాద్; మార్చి 22 (నేటి దర్శిని):**
జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారుడు వేణు ముప్పాల యోనెక్స్ సన్‌రైజ్ 48వ ఇండియన్ మాస్టర్స్ నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ 2025-26లో సింగిల్స్ మరియు డబుల్స్ విభాగాల్లో క్వాలిఫికేషన్ రౌండ్లను విజయవంతంగా అధిగమించి మెయిన్ డ్రాలోకి ప్రవేశించి తన ప్రతిభను చాటుకున్నారు. పురుషుల సింగిల్స్ క్వాలిఫికేషన్ ఫైనల్లో తమిళనాడుకు చెందిన శివ శంకర్‌పై వేణు ముప్పాల అద్భుత పోరాటం కనబరిచారు. 57 నిమిషాల పాటు సాగిన మూడు సెట్ల మ్యాచ్‌లో మొదటి సెట్ను 15-9తో గెలిచిన వేణు, రెండో సెట్ను 12-15తో కోల్పోయినా, నిర్ణయాత్మక మూడో సెట్లో 15-11తో విజయం సాధించి మెయిన్ డ్రాలోకి అడుగుపెట్టారు. డబుల్స్ విభాగంలో జ్ఞాన ప్రసాద్ రెడ్డితో జతకట్టిన వేణు ముప్పాల, నాలుగేళ్ల కృషికి ఫలితంగా గొప్ప విజయాన్ని నమోదు చేశారు. క్వాలిఫికేషన్ ఫైనల్లో మహారాష్ట్ర టాప్ సీడ్ జోడీ సచిన్ భారతి, కౌశిక్ వర్తక్‌లపై తొలి సెట్ను 13-15తో కోల్పోయినా, అనంతరం 15-10, 15-13తో తిరుగుబాటు చేసి 74 నిమిషాల ఉత్కంఠభరిత పోరులో మెయిన్ డ్రాలోకి ప్రవేశించారు. సింగిల్స్, డబుల్స్ రెండు విభాగాల్లోనూ క్వాలిఫికేషన్ నుంచి మెయిన్ డ్రాలోకి చేరడం అరుదైన ఘనతగా నిలిచింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో కర్ణాటకకు చెందిన శికా లాంబ్‌తో కలిసి పోటీ పడిన వేణు, క్వాలిఫికేషన్ ఫైనల్లో చంద్ చావత్, మధుస్మిత జోడీపై మొదటి సెట్ను 15-13తో గెలిచినా, తరువాతి సెట్లలో 11-15, 13-15తో ఓటమి పాలై తృటిలో మెయిన్ డ్రా అవకాశాన్ని కోల్పోయారు. వేణు ముప్పాల జాతీయ స్థాయి క్రీడాకారుడిగానే కాకుండా మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ వ్యవస్థాపకుడు, చైర్మన్‌గా యువ క్రీడాకారులను తీర్చిదిద్దడంలో విశేష కృషి చేస్తున్నారు. ఆయన సాధించిన ఈ విజయాలు భవిష్యత్ పోటీల్లో మరిన్ని విజయాలకు దారితీయనున్నాయి.

WWW.NETIDARSHINI.COM
RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక
సత్య శోధనే మా లక్ష్యం

# వైద్య సేవలు అందించడంలో స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయం

- మెగా ఉచిత వైద్య శిబిరం ప్రారంభించిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- వైద్యురాలిగా సేవలు అందించిన వరంగల్ ఎంపీ
- ప్రజలకు స్వయంగా బీపీ చెక్ చేసి మందులు అందజేసిన ఎంపీ
- వైద్యం వ్యాపారం కాదు, మానవ సేవ
- కూరపాటి ఫౌండేషన్ ట్రస్ట్ సేవలను అభినందించిన ఎంపీ
- బడుగు బలహీన వర్గాల కోసం మండలాల వారీగా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి
- ప్రజలు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి
- ప్రజలు ప్రతి ఏడాది ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి చేసుకోవాలి

**ఉమ్మడి వరంగల్, మార్చి 22(నేటి దర్శిని బ్యూరో):**
ప్రజలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ప్రతి సంవత్సరం వైద్య పరీక్షలు చేయించుకుంటూ సరైన ఆహారం జీవనశైలితో జాగ్రత్తలు తీసుకోవాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం కూరపాటి ఫౌండేషన్ ట్రస్ట్ సహకారంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మరోసారి తన వైద్య వృత్తిని స్మరింపజేస్తూ వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య శిబిరానికి వచ్చిన ప్రజలతో నేరుగా మమేకమై వారికి బీపీ చెక్ చేసి, వైద్య రిపోర్టులను పరిశీలించి, అవసరమైన మందులను స్వయంగా అందజేశారు.




ప్రజల ఆరోగ్య పరిస్థితులను ఆత్మీయంగా అడిగి తెలుసుకుంటూ సేవాభావంతో వ్యవహరించడం అక్కడ అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ వైద్యం అనేది వ్యాపారం కాకుండా మానవతా దృక్పథంతో చూడాల్సిన రంగమని అన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడంలో స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని పేర్కొన్నారు. సేవా భావనతో కూరపాటి ఫౌండేషన్ ట్రస్ట్ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులను ప్రత్యేకంగా ఎంపీ అభినందించారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు అధికంగా ఉన్నందున మండలాల వారీగా ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను తరచూ నిర్వహించి ప్రజలకు చేరువలోనే వైద్య సేవలు అందించాలని కోరారు. ప్రస్తుతం 30-40 ఏళ్ల వయసులోనే హార్ట్ ఎటాక్‌లతో ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. ఒకప్పుడు 50 ఏళ్లు దాటిన తరువాత కనిపించే అనారోగ్య సమస్యలు ఇప్పుడు తక్కువ వయసులోనే వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ప్రతి సంవత్సరం వైద్య పరీక్షలు చేయించుకుంటూ, సరైన ఆహారం, జీవనశైలితో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల ఆరోగ్యమే సమాజ అభివృద్ధికి పునాదని పేర్కొంటూ ఆరోగ్యంపై అప్రమత్తత పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా, ఉప సర్పంచ్ కొమురమ్మ సాయిపేట సర్పంచ్ లక్ష్మి, మండల అధ్యక్షులు గుర్రపు ప్రసాద్, కూరపాటి ట్రస్ట్ చైర్మన్ కూరపాటి రమేష్, డాక్టర్ సుస్మిత, ఇతర వైద్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మిడ్జిల్ బిఆర్ఎస్ మండల అధ్యక్షుని గా గంజి కృష్ణ...???



**మిడ్జిల్, మార్చి 22 (నేటి దర్శిని ప్రతినిధి):**
మిడ్జిల్ మండల బిఆర్ఎస్ అధ్యక్షునిగా గంజి కృష్ణ నియామకం అవుతున్నట్లు మండల బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అనుకుంటున్నారు. మిడ్జిల్ మండల కేంద్రానికి చెందిన గంజి కృష్ణ తన తల్లి గంజి సరోజ యాదయ్య ను ఎంపీటీసీగా భారీ మెజారిటీతో గెలిపించిన విషయం విధితమే ప్రస్తుతం బిఆర్ఎస్ మండల అధ్యక్షునిగా కొనసాగుతున్న పాండు యాదవ్ పదవీకాలం ముగిస్తున్న తరుణంలో మండలంలోని సీనియర్ నాయకులు గంజి కృష్ణ వైపు ఉన్నట్లు ఊహాగానాలు వెలువడుతున్నాయి. మండల కేంద్రానికి చెందిన గంజి కృష్ణ అధ్యక్షులుగా నియమిస్తే పార్టీ బలోపేతానికి కృషి చేస్తాడని పార్టీ సీనియర్ నాయకులు తెలిపారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఆశీస్సులు కూడా గంజి కృష్ణ కే ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

- పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తాం
- ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు పోసే కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**ఉమ్మడి వరంగల్, మార్చి 21 (నేటి దర్శిని బ్యూరో):**
పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేస్తున్నమని వర్ధన్నపేట ఎమ్మెల్యేకె ఆర్ నాగరాజు అన్నారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం పరిధిలోని పర్వతగిరి గ్రామ పంచాయతీ పరిధిలో దేవిలాల్ తండాకి చెందిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు లావుడ్య మంగమ్మ - రాములు ఇంటి నిర్మాణం కోస ముగ్గుపోసే కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ పాల్గొని కొబ్బరికాయ కొట్టి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేస్తామని అన్నారు. పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. లబ్ధిదారులకు విడుదలవారీగా రూ 5లక్షలు అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తుందని అన్నారు. ఉచిత ఇసుకను పంపిణీ చేస్తామని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఎవరికి ఒక్క రూపాయి ఇవ్వద్దని, ఎవరైనా తీసుకుంటే వారిపై చర్యలుతీసుకుంటామన్నారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాలు లేవని, పదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు మహిళా సంఘాల ద్వారా రుణాలు తీసుకోవచ్చని అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇండ్లను నిర్మించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి గ్రామ సర్పంచ్ చిదురు శంకర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కూసం రామచందర్, మండల పార్టీ అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్, ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సాయిబాబా కాలనీ సమస్యల పరిశీలన

- డ్రైనేజీ, దోమల సమస్యలతో సాయిబాబా కాలనీ వాసుల ఆవేదన
- కాలనీ సమస్యలపై వెంటనే స్పందించిన మాజీ కార్పొరేటర్ పవన్ కుమార్



**కొత్తపేట, మార్చి 22 (నేటి దర్శిని):**
కొత్తపేట డివిజన్ పరిధిలోని సాయిబాబా కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ నివాసితులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కాలనీలో డ్రైనేజీ సమస్యలు తీవ్రమైపోయాయని స్థానికులు తెలిపారు. తరచూ సెవేజ్ బ్లాక్ అవ్వడంతో మురుగు నీరు రోడ్లపైకి పొంగి వస్తోందని వారు వాపోయారు. అలాగే మాన్‌హోల్ కవర్లు సరిగా లేకపోవడం వల్ల రహదారులపై నడవడం, వాహనాలు నడపడం ప్రమాదకరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను పరిశీలించిన పవన్ కుమార్ వెంటనే స్పందించి సంబంధిత ఏఈ స్రవంతి గారికి ఫోన్ చేసి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఇదే సమయంలో కాలనీలో దోమల బెడద ఎక్కువగా ఉందని ప్రజలు తెలిపారు. ఫాగింగ్ సరిగా నిర్వహించకపోవడంతో పరిస్థితి మరింత విషమించిందని వారు పేర్కొన్నారు. రెగ్యులర్‌గా ఫాగింగ్ చేయాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. సమస్యలను తెలుసుకున్న పవన్ కుమార్ సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రామారావు, జనరల్ సెక్రటరీ సురేష్ యాదవ్, అమర్, రమేష్, భరత్, కాలనీవాసులు మరియు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# బీజేపీ నవ భారత నిర్మాణంలో ఒక కీలక శక్తి

- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్



**ఉమ్మడి వరంగల్, మార్చి 22 (నేటి దర్శిని బ్యూరో):**
వరంగల్ జిల్లా ఏనుమాముల మండలం ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు బుద్దే శ్రీనివాస్ అధ్యక్షతన పద్మావతి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ అభియాన్ లో బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అంత్యోదయ దృష్టి, సమగ్ర మానవతా భావన, సేవాతత్వం, జాతీయతా స్ఫూర్తిని కార్యకర్తలకు వివరించారు. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అంత్యోదయ భావనను కార్యరూపంలోకి తీసుకువస్తూ, సమాజంలోని చిట్ట చివరి వ్యక్తి వరకు సేవా కార్యక్రమాలను చేర్చే దిశగా ప్రతి కార్యకర్త అంకితభావంతో పని చేయాలన్నారు. పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆదర్శాలను, సిద్ధాంతాలను, సైద్ధాంతిక నిబద్ధతతోనే సంస్థాగత నిర్మాణం, మానవుడిని కేంద్రంగా ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం అన్నారు. సంస్థాగత సామర్థ్యాన్ని పెంచడానికి చేపట్టిన ప్రతిష్టాత్మక శిక్షణ ఇది, ప్రజాస్వామ్య విలువల స్థాపన, విలువలపై ఆధారపడిన రాజకీయాలు, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి నిరంతర అధ్యయనంపై వివరించారు. వ్యక్తి నిర్మాణం - సంస్థా నిర్మాణం - దేశ నిర్మాణం నినాదంతో కార్యకర్తలకు శిక్షణ ఇవ్వడం వంటి అంశాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రశిక్షణ జిల్లా కన్వీనర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్, బిజెపి రాష్ట్ర నాయకులు జలగం రంజిత్ రావు, మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ జన్ను ఆరోగ్యం, మండల ప్రధాన కార్యదర్శి కొత్తకొండ రాజు, మరియు మండల, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హైదరాబాద్ లో జరిగిన పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న మిడ్జిల్ మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు బరిగెల వెంకటయ్య, మున్ననూర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లికార్జున్ రెడ్డి, మిడ్జిల్ ఇందిరమ్మ కమిటీ సభ్యుడు రామ్ గౌడ్,
(నేటి దర్శిని ప్రతినిధి మిడ్జిల్)

# బిజినెస్

## రూ.11 వేలు తగ్గిన బంగారం.. కొనుగోలు చేసేవారికి భారీ శుభవార్త.. ఇదే మంచి ఛాన్స్



డాలర్ బలపడటం, ఫెడ్ వడ్డీ రేట్లపై అనిశ్చితి, అంతర్జాతీయ ఉద్రిక్తతల క్రమంలో గోల్డ్ రేట్లలో తగ్గుదల నమోదవుతోంది. ఈ వారంలో బంగారం ధరలు తగ్గుతూనే ఉన్నాయి. ఆదివారం కూడా గోల్డ్ రేట్లు పడిపోగా.. వచ్చే వారంలో కూడా భారీగా కుప్పకూలే అవకాశముంది. ఈ వారం పొడవునా బంగారం ధరలు పతనమవ్వగా.. రానున్న రోజుల్లో మరింత తగ్గే అవకాశాలున్నాయనే అంచనాలు వెలువడుతున్నాయి. మార్చి 13న గోల్డ్ రేటు రూ.1,58,399 వద్ద ఉండగా.. మార్చి 16 నాటికి రూ.1,55,714కి తగ్గింది. మార్చి 17న రూ.1,55,668కి పడిపోగా.. మార్చి 18న రూ.1,54,879కి డౌన్ అయింది. మార్చి 19న రూ.1,47,889 వద్ద ట్రేడ్ అవ్వగా.. మార్చి 20 నాటికి రూ.1,47,218 వద్ద ముగిసింది. గత వారంతో పోలిస్తే ఈ వారంలో పసిడి ధరలు గణనీయంగా తగ్గాయి. అంతర్జాతీయంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో సాధారణంగా గోల్డ్ రేట్లు పెరుగుతాయి. కానీ డాలర్ బలపడటం, మార్కెట్ల అస్థిరత, పెట్టుబడిదారులు నగదు అవసరాల కారణంగా బంగారాన్ని విక్రయించారు. దీని వల్ల గోల్డ్ రేట్లు తగ్గాయిడాలర్ బలపడటం బంగారం డిమాండ్‌ను తగ్గించింది. ఇక ఫెడ్ వడ్డీ రేట్లను సవరిస్తుందనే భయాలు ఒత్తిడిని పెంచాయి. ఇక పశ్చిమ ఆసియా ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ పెట్టుబడిదారలు లాభాలను పొందారు. ఇక యుద్ధ పరిస్థితుల క్రమంలో ముడి చమురు ధరలు పెరగడం ద్రవ్యోల్బణం భయాలను పెంచింది. బంగారం ధరల పతనానికి ఇవే కారణంగా చెప్పవచ్చు. ఈ వారంలో బంగారం ధరలు రూ.11 వేలు తగ్గాయి. ఇక వెండి ధరలు కూడా కుప్పకూలాయి. మార్చి 13న కిలో సిల్వర్ రూ.2,60,488 వద్ద ఉండగా.. మార్చి 20 నాటికి రూ.2,32,364కి తగ్గిపోయింది. ఈ వారంలో మొత్తం రూ.28 వేల మేర క్రాష్ అయింది. బంగారంతో పోలిస్తే సిల్వర్ ధరల తగ్గుదల ఎక్కువగా ఉంది. ఆర్థిక అనిశ్చితి వల్ల ధరలు తగ్గాయని చెప్పవచ్చు.

## జాన్‌డీర్ సరికొత్త ట్రాక్టర్లు



**న్యూఢిల్లీ**

ప్రముఖ ట్రాక్టర్ల తయారీ సంస్థ జాన్ డీర్.. మార్కెట్లోకి 5130 ఎం సిరీస్ ట్రాక్టర్లను పరిచయం చేసింది. వ్యవసాయ రంగంలో వస్తున్న డిజిటల్ మార్పులకు అనుగుణంగా ఈ నయా ట్రాక్టర్లను తీర్చిదిద్దినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. 5 ఎం సిరీస్‌లో భాగంగా ప్రవేశపెట్టిన 5130 ఎం ట్రాక్టర్ 130 హెచ్‌పీ సామర్థ్యంతో పనిచేయనున్నది

## నయా స్కోడా కుషక్.. ప్రారంభ ధర రూ 10.69 లక్షలు




హైదరాబాద్ : స్కోడా ఇండియా మరో మాడల్‌ను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది. నూతన కుషక్ ఎస్‌యూవీ మాడల్‌ను తీసుకొచ్చింది. రూ.10.69 లక్షల ప్రారంభ ధరతో లభించనున్న ఈ కారు గరిష్ఠంగా రూ.19 లక్షలుగా నిర్ణయించింది. పాత మాడల్‌తో పోలిస్తే ఈ నయా మాడల్‌ను ఆధునీకరించినట్టు, ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్స్, ఎలక్ట్రిక్ సన్‌రూఫ్, వాతావరణానికి తగ్గట్టుగా ఏసీ కంట్రోల్, 17.7 ఇంచుల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్, భద్రతా ప్రమాణాలకు పెద్దపీట వేయడంలో భాగంగా 40కి పైగా భద్రత ఫీచర్లు, 1.5 టీఎస్‌ఐ ప్రిస్టేజ్ ఇంజిన్‌తో రూపొందించినట్టు స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ అశిష్ గుప్తా తెలిపారు. లీటర్ పెట్రోల్‌కు 19.66 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది.

# స్పోర్ట్స్

## ఐదు బంతుల్లో 5 సిక్సర్లు.. వైల్డ్ ఫైర్ ఆటతో అలరించిన కొత్త కుర్రాడు..!




ఐపీఎల్ అంటే చాలు కుర్రాళ్లు రెచ్చిపోతుంటారు. తమదైన దూకుడుతో అలరిస్తూ జాతీయ సెలెక్టర్ల దృష్టిలో పడాలని ఆశ పడుతారు. ఐపీఎల్ మెరుపులతో భారత జట్టు జెర్సీ వేసుకోవాలని కలలు కంటారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ యువకెరటం సలీల్ అరోరా త్వరలోనే ఈ జాబితాలో చేరేలా కనిపిస్తున్నాడు. పంతొమ్మిదో సీజన్ లక్ష్యంగా నెట్స్‌లో చెమటోడ్చుతున్న సలీల్ సిక్సర్ల మోత మోగించాడు. శనివారం ప్రాక్టీస్ మ్యాచ్‌లో శివమెత్తిన ఈ చిచ్చరపిడుగు వరుసగా ఐదు బంతులకు ఐదు సిక్సర్లు బాది నాతో జాగ్రత్త అని ప్రత్యర్థులకు హెచ్చరికలు పంపాడు. మాజీ ఛాంపియన్ సన్‌రైజర్స్ హైదరాబాద్ పంతొమ్మిదో సీజన్‌కు పక్కాగా సిద్ధమవుతోంది. పవర్ హిట్టర్లతో నిండిన ఆరెంజ్ ఆర్మీలో మరో కుర్రాడు సిక్సర్లతో వార్తల్లో నిలిచాడు. శనివారం ప్రాక్టీస్ మ్యాచ్‌లో రెచ్చిపోయిన సలీల్ అరోరా ఐదు సిక్సర్లతో వారెవా అనిపించాడు. ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్‌లో సీనియర్ పేసర్ జయదేవ్ ఉనాద్కట్ ఓవర్లో చివరి రెండు బంతుల్ని సిక్సర్లుగా మలిచిన సలీల్.. ఆ తర్వాత ఓంకార్ తరమలేకు చుక్కలు చూపించాడు. అతడు సంధించిన తొలి మూడు బంతుల్ని స్టాండ్స్‌లోకి పంపాడు. మినీ వేలంలో రూ.1.50 కోట్లు పలికిన సలీల్.. తన స్టయిల్ అటాకింగ్ గేమ్‌తో పంతొమ్మిదో సీజన్‌లో చెలరేగిపోవాలని భావిస్తున్నాడు. వికెట్ కీపరైన ఈ కుర్రాడిని ఆరెంజ్ ఆర్మీ ఎన్ని మ్యాచుల్లో ఆడిస్తుందో చూడాలి.

**కమిన్స్ ఆలస్యంగా**

ఐపీఎల్ చరిత్రలో రికార్డు స్కోర్ కొట్టిన సన్‌రైజర్స్ హైదారబాద్ ఈసారీ తడాఖా చూపించాలనుకుంటోంది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, హెన్రిచ్ క్లాసెన్ వంటి హిట్టర్లకు తోడు తాత్కాలిక కెప్టెన్ ఇషాన్ శర్మ దంచేసేందుకు సిద్ధమవుతున్నారు. రెగ్యులర్ సారథి ప్యాట్ కమిన్స్ ఆలస్యంగా జట్టుతో కలువనున్నాడు. సో.. ఆలోపు ఇషాన్ సారథ్యంలోనే ఆరెంజ్ ఆర్మీ ఆడనుంది. మార్చి 28 నుంచి ఐపీఎల్ ప్రారంభం కానుంది. ఆరంభ పోరులో ఢిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీతో హైదరాబాద్ తలపడనుంది.

## పంత్‌కు ప్రమోషన్.. మిడిలార్డర్ బ్యాటర్‌గా విధ్వంసక హిట్టర్..!




ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ బ్యాటింగ్ ఆర్డర్ మారనుంది. నాలుగు, ఐదో స్థానాల్లో ఆడిన పంత్ ఈ ఎడిషన్‌లో మూడో స్థానంలో క్రీజులోకి రానున్నాడు. పవర్ ప్లేలో వికెట్ పడితే.. వేగంగా పరుగులు రాబట్టే బాధ్యతను కెప్టెన్‌కు అప్పగించింది లక్నో యాజమాన్యం. నిరుడు నికోలస్ పూరన్ మూడులో ఆడగా.. ఈసారి పంత్ చెలరేగిపోనున్నాడు. పంతొమ్మిదో సీజన్‌లో కొత్త జెర్సీ, కొత్త లోగోతో లక్నో సూపర్ జెయింట్స్ బరిలోకి దిగుతోంది. ఈసారైనా ఐపీఎల్ ట్రోఫీ గెలవాలనే కసితో ఉన్న లక్నో జట్టు అయోధ్య రాముడిని దర్శించుకుంది కూడా. మెగా టోర్నీకి ఆరు రోజులు ఉన్నందున అన్ని విభాగాలను సరి చూసుకుంటున్న రిషభ్ పంత్ సేన బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పు చేయాలనుకుంటోంది. గత సీజన్‌లో మూడో స్థానంలో ఆడిన నికోలస్ పూరన్‌ను మిడిలార్డర్‌లో ఆడించి.. సారథికి ప్రమోషన్ ఇవ్వాలనుకుంటోంది. మెగా వేలంలో రికార్డు ధర(రూ.27 కోట్లు) పలికిన పంత్‌ను జట్టు అవసరం రీత్యా మూడో స్థానంలో ఆడించాలని లక్నో సూపర్ జెయింట్స్ భావిస్తోంది. 'దూకుడుగా ఆడే పంత్ మూడో స్థానానికి పక్కాగా సరిపోతాడని మేనేజ్‌మెంట్ సహా అతడు భావిస్తున్నాడు. అందుకని ఈ సీజన్‌లో టాపార్డర్‌లో ఎడెన్ మర్క్‌రమ్, మిచెల్ మార్ష్, రిషభ్ పంత్ ఆడుతారు. మిడిలార్డర్‌లో మాత్రం ఈ షరతులేమీ లేవు. ఆ రోజు ఆటను బట్టి ఎవరిని ముందు పంపాలి? అనేది అప్పటికప్పుడు నిర్ణయిస్తాం' అని లక్నో వర్గాలు పీటీఐతో తెలిపాయి. గత సీజన్‌లో పంత్‌పై భారీ ఆశలు పెట్టుకున్న లక్నోకు తీవ్ర నిరాశే మిగిలింది. 13 మ్యాచుల్లో మోస్తరుగా ఆడిన అతడు ఆఖరి మ్యాచ్‌లో ఆర్సీబీపై సెంచరీ(118 నాటౌట్)తో 269 పరుగులు సాధించాడు. ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో ఏప్రిల్ 1న ఢిల్లీ క్యాపిటల్స్‌తో లక్నో తలపడనుంది.

## ఐపీఎల్ కోసం పాకిస్థాన్ సూపర్ లీగ్‌కు డుమ్మా.. రాజస్థాన్ గూటికి శ్రీలంక కెప్టెన్..!




ప్రపంచంలోనే పాపులర్ టీ20 లీగ్‌గా పేరొందిన ఐపీఎల్ కోసం పలువురు క్రికెటర్లు పాకిస్థాన్ సూపర్ లీగ్‌ను వీడుతున్నారు. ఇప్పటికే జింబాబ్వే ఆటగాడు బ్లెస్సింగ్ ముజరబాని పీఎస్‌ఎల్‌కు గుడ్ బై చెప్పేసి కోల్‌కతా నైట్ రైడర్స్ స్క్వాడ్‌లో చేరగా.. శ్రీలంక కెప్టెన్ దసున్ శనక సైతం పీఎస్‌ఎల్ నుంచి వైదొలగనున్నాడు. ఇటీవల పొట్టి ప్రపంచకప్‌లో చెలరేగిన శనకతో రాజస్థాన్ రాయల్స్ ఒప్పందం చేసుకోనుంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ పంతొమ్మిదో సీజన్ మరో ఆరు రోజుల్లో ప్రారంభమవ్వనుంది. మెగా టోర్నీకి కౌంట్‌డౌన్ మొదలేన వేళ గాయాలతో వైదొలిగిన వారి స్థానంలో కొత్త వారిని తీసుకుంటున్నాయి ఫ్రాంచైజీలు. దాంతో, పాకిస్థాన్ సూపర్ లీగ్ వేలంలో అమ్ముడైన ఆటగాళ్లు సైతం ఐపీఎల్ ఆడేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ క్రమంలోనే కొందరు పాకిస్థాన్ సూపర్ లీగ్ కాంట్రాక్టును సైతం వదులుకుంటున్నారు. తాజాగా దసున్ శనక కూడా ఐపీఎల్ కోసం పీఎస్‌ఎల్ నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నాడు. ఆల్‌రౌండరైన శనకను కొనేందుకు రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ సిద్దంగా ఉంది. గాయపడిన ఆల్‌రౌండర్ సామ్ కరన్ స్థానంలో శనకను తీసుకోవాలని ఫ్రాంచైజీ పావులు కదుపుతోంది. ఇదే విషయంపై ప్రశ్నించగా అవును. మేము శనకతో ఒప్పందం చేసుకోబోతున్నాం. కొన్ని అంశాలు పూర్తి కావాల్సి ఉంది. అతడు శ్రీలంక క్రికెట్‌కు కొన్ని పేపర్లు సమర్పించాల్సి ఉంది అని రాజస్థాన్ రాయల్స్ అధికారి ఒకరు క్రిక్‌బజ్‌తో వెల్లడించాడు.

**రూ.75 లక్షలకు**

నిరుడు అబుధాబీలో జరిగిన ఐపీఎల్ మినీ వేలంలో దసున్ శనకను కొనేందుకు ఫ్రాంచైజీలు ఆసక్తి చూపించలేదు. కానీ, ఇటీవల ప్రపంచకప్‌లో చెలరేగిన అతడితో పీఎస్‌ఎల్ ఫ్రాంచైజీ లాహోర్ క్యాలండర్స్ పాక్ కరెన్సీలో రూ.75 లక్షలకు కొన్నది. అయితే.. శనక ఐపీఎల్ ఆడాలని నిర్ణయించుకున్నందున పీఎస్‌ఎల్ కాంట్రాక్ట్ ఉల్లంఘన కింద చర్యలు తీసుకోవాలని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు భావిస్తోంది.



## లవ్ టుడే' బ్యూటీ స్టన్నింగ్ ఫొటో షూట్..



# అలాంటి ట్రోల్స్ వల్ల చాలా ఏడ్చా:

అందాల భామ శ్రీలీల ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకుపోతుంది. తెలుగులో తక్కువ సమయంలోనే ఈ అమ్మడు మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. కన్నడ ఇండస్ట్రీ నుంచి వచ్చిన శ్రీలీల తెలుగులో ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుంది. పెళ్ళిసందడి సినిమాతో హీరోయిన్ గా టాలీవుడ్ కు ఎంట్రీ ఇచ్చింది శ్రీలీల.. ఈ సినిమా పర్లేదు అనిపించుకుంది. ఆతర్వాత రవితేజ హీరోగా నటించిన ధమాకా సినిమాతో మంచి విజయాన్ని అందుకుంది. ధమాకా సినిమా బ్లాక్ బస్టర్ అవ్వడంతో శ్రీలీల కు వరుస ఆఫర్స్ క్యూ కట్టాయి. చేతి నిండా సినిమాలతో ఫుల్ బిజీగా మారిపోయింది. ఏడాదికి రెండు, మూడు సినిమాలు చేసింది. యంగ్ హీరోల దగ్గర నుంచి స్టార్ హీరోల వరకూ అందరితో కలిసి నటించింది. కానీ హిట్స్ మాత్రం శ్రీలీలకు దక్కలేదనే చెప్పాలి.తెలుగులో ఈ అమ్మడు ఇప్పటివరకు పది సినిమాల్లో నటించింది. వాటిలో హిట్ అయినవి రెండే రెండు సినిమాలు అందులో ఒకటి ధమాకా అయితే మరొకటి భగవంత్ కేసరి సినిమా.. అయితే భగవంత్ కేసరి సినిమా బాలయ్య ఖాతాలోకి వెళ్ళిపోయింది. రీసెంట్ గా ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో నటించింది. మార్చ్ 19న విడుదలైన ఈ సినిమా మంచి టాక్ తెచ్చుకుంది. ఇదిలా ఉంటే హిట్స్ కంటే ఫ్లాపులే ఎక్కువ ఉన్న శ్రీలీల పై గతంలో చాలా ట్రోల్స్ వచ్చాయి. ఫ్లాపుల కారణంగా శ్రీలీల ట్రోల్స్ బారిన పడింది.తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన పై వచ్చిన ట్రోల్స్ పై స్పందించింది శ్రీలీల. కెరీర్ బిగినింగ్ లో నేటిజివ్ ట్రోల్స్ విషయంలో చాలా భయపడ్డాను. కొన్నిసార్లు చాలా బాధగా అనిపించేది.. ఏడ్చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. అప్పుడు మా అమ్మతో ఇదంతా నావల్ల అవుతుందా.? కాలేజీకి తిరిగెళ్లిపోనా.? అని అడిగాను. ఎందుకంటే నేను చాలా సెన్సిటివ్. కానీ, ఇప్పుడు వాటిని ధైర్యంగా ఎదుర్కొంటున్నా అని చెప్పుకొచ్చింది శ్రీలీల. ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి.

# 'పెద్ది' ఐటెం సాంగ్‌లో మృణాల్ ఠాకూర్..

## రామ్ చరణ్‌తో స్పెషల్ డ్యాన్స్‌కు సిద్ధమా?

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'పెద్ది'పై రోజురోజుకు అంచనాలు పెరుగుతున్నాయి. ఏప్రిల్ 30న విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో మిగిలి ఉన్న కీలక అంశాల్లో ఒకటైన ఐటెం సాంగ్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. దర్శకుడు బుచ్చిబాబు సన స్పెషల్ సాంగ్ కోసం సరైన హీరోయిన్ ఎంపికపై కొంతకాలంగా తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. మొదట ఈ పాటలో ముగ్గురు లేదా నలుగురు హీరోయిన్లను తీసుకోవాలనే ఆలోచన ఉన్నప్పటికీ, సమయం తక్కువగా ఉండటంతో ఆ ప్లాన్‌ను విరమించుకున్నట్లు సమాచారం. తాజాగా ఈ స్పెషల్ సాంగ్‌లో రామ్ చరణ్ సరసన నటించేందుకు మృణాల్ ఠాకూర్‌ని ఎంపిక చేసినట్లు టాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.వాస్తవానికి ఈ వార్త కొద్దిరోజుల క్రితమే వినిపించినా, అధికారికంగా ఎలాంటి క్లారిటీ లేదు. అయితే ఇటీవల మృణాల్ ఠాకూర్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు, ఆమె హైదరాబాద్‌లో ఉన్నట్లు తెలియజేసే పోస్టులు ఈ వార్తలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. ఆమె 'పెద్ది' పాట షూట్ కోసమే నగరానికి వచ్చినట్లు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. ఇక మృణాల్ ప్రస్తుతం అడివి శేష్‌తో కలిసి నటిస్తున్న 'డెకాయిట్' సినిమా ప్రమోషన్లతో కూడా బిజీగా ఉన్నారు. ఏప్రిల్ 10న విడుదల కానున్న ఈ చిత్రం కోసం ఆమె డేట్లను టీమ్ ప్రత్యేకంగా ప్లాన్ చేసింది. ఈ ప్రమోషన్ల మధ్యలో లభించే గ్యాప్‌లోనే 'పెద్ది' ఐటెం సాంగ్ షూట్ పూర్తి చేయాలని యూనిట్ భావిస్తోంది మరో ఆసక్తికర విషయం ఏమిటంటే, ఈ పాటలో మృణాల్ ఠాకూర్‌తో పాటు జాన్వీ కపూర్ కూడా కనిపించే అవకాశమున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా దర్శకుడు బుచ్చిబాబు ఈ సినిమా నుంచి టీజర్ లేదా ట్రైలర్ రూపంలో స్పెషల్ అప్డేట్ ఇవ్వొచ్చని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఇదిలా ఉండగా, 'పెద్ది' సినిమా వాయిదా పడుతుందనే ప్రచారాలకు చిత్రబృందం ఇప్పటికే చెక్ పెట్టింది. ఓవర్సీస్‌లో అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కానుండగా, బిజినెస్ వ్యవహారాలు కూడా క్రమంగా పూర్తి అవుతున్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ విడుదల తేదీ మిస్ కాకూడదనే పట్టుదలతో యూనిట్ పగలు రాత్రి శ్రమిస్తోంది. రెహమాన్ అందుబాటులోకి రాగానే సెకండాఫ్ రీ-రికార్డింగ్ పనులు వేగవంతం కానున్నాయి. మొత్తం మీద అన్ని పనులు ప్లాన్ ప్రకారం సాగుతున్న నేపథ్యంలో 'పెద్ది' విడుదల వాయిదా పడే అవకాశాలు లేవనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.






# రైతులే 'వంద దేవుళ్లు'

హీరో విజయ్ ఆంటోని, దర్శకుడు శశి కలయికలో వచ్చిన 'బిచ్చగాడు' చిత్రం సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. తాజాగా వీరిద్దరి కాంబినేషన్‌లో 'వంద దేవుళ్లు' పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతున్నది. శనివారం ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను హీరో మంచు విష్ణు సోషల్‌మీడియా ద్వారా ఆవిష్కరించారు రైతు సమస్యలు చుట్టూ ఈ కథ నడుస్తుందని, విజయ్ ఆంటోని రా అండ్ రస్టిక్ పాత్రలో కనిపిస్తారని, బలమైన సామాజిక సందేశం మేళవించిన చిత్రమిదని మేకర్స్ తెలిపారు. స్వాసిక, అజయ్, కావ్య, శక్తి, పదిని, కర్నాస్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: బాలాజీ శ్రీరామ్, నిర్మాత: రామంజనేయులు జవ్వాజి, సమర్పణ: ఫాతిమా విజయ్ ఆంటోని, దర్శకత్వం: శశి.

# టికెట్ ధరలు తగ్గించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' టీమ్..

## -ఫ్యామిలీ ఆడియెన్స్‌ను ఆకర్షించే స్ట్రాటజీ!




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కించిన మాస్ ఎంటర్టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్'. ఈ మూవీ ఉగాది కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. విడుదలైన మొదటి రోజునుంచే ఈ సినిమా మంచి స్పందనను అందుకుంటూ, ముఖ్యంగా వీకెండ్‌లో రెండు తెలుగు రాష్ట్రాల్లో సాలిడ్ కలెక్షన్లను రాబడుతోంది. సినిమాలో మాస్ ఎలిమెంట్స్, పవన్ కళ్యాణ్ స్టైల్ యాక్షన్, ఎంటర్టైనింగ్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. అయితే ఆంధ్రప్రదేశ్‌లో ఈ సినిమాకు టికెట్ ధరలు పెంచిన విషయం తెలిసిందే. ఈ ధరల పెంపు సాధారణ ప్రేక్షకులపై, ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియెన్స్‌పై ప్రభావం చూపిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.టికెట్ రేట్లు ఎక్కువగా ఉండటంతో కొంతమంది ప్రేక్షకులు థియేటర్లకు రావడానికి వెనుకంజ వేస్తున్నారని సినీ వర్గాల్లో చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో చిత్రబృందం కీలక నిర్ణయం తీసుకుంది. సోమవారం నుంచి ఆంధ్రప్రదేశ్‌లో సాధారణ టికెట్ ధరలతోనే సినిమా ప్రదర్శించనున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం ద్వారా మరింత మంది ప్రేక్షకులను థియేటర్లకు రప్పించి, ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియెన్స్‌ను ఆకర్షించాలని మేకర్స్ భావిస్తున్నారు. టికెట్ ధరలు తగ్గించడం వల్ల సినిమాకు లాంగ్ రన్‌లో మరింత కలెక్షన్లు వచ్చే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇక ఈ చిత్రానికి రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించగా, ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. థమన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించారు. సినిమాకి తొలి రోజే మిక్స్‌డ్ టాక్ లభించింది. అయితే టికెట్ ధరలు తగ్గించే ఈ నిర్ణయం 'ఉస్తాద్ భగత్ సింగ్'కు ఎంతవరకు ప్లస్ అవుతుందో రాబోయే రోజుల్లో స్పష్టమవనుంది.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365